Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం, మార్చి 24, 2026 | సంపుటి - 20 | సంచిక 192 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

### ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

### తక్షణం కోర్టు ముందుకు రావాలని ఆదేశం



హైదరాబాద్ : రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవ డంతో ఆర్థిక కార్యదర్శిపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాము.. . ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిట ిషన్‌కు విచారణకు వచ్చింది. 2లో

## మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం



**హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి**

**రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ**

- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు... మాది స్మార్ట్ గవర్నెన్స్
- శానమండలిలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ :

ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు.

తరువాయి 2లో



## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

**బియ్యం ఎగుమతలపై అసెంబ్లీలో మాటల యుద్ధం**

**అక్రమాలు జరిగాయన్న హరీష్ రావు**

**హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్**

**హరీష్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్ : బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టు కున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం

తరువాయి 2లో



రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన

## ఘనత మీదే

**బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క**

హైదరాబాద్ :


తెలంగాణ అసెంబ్లీలో బ్జడెట్ చర్చలు వాడి వేడిగా సాగు తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఖజానా సరిపోతోందని ఆమె ధ్వజమెత్తారు. పాండ వులు సంపాదించింది కౌరవుల తద్దినానికే సరిపోయినట్లు.. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే తరువాయి 2లో

విద్యుత్ ఉద్యోగులకు

## అండగా ప్రభుత్వం

**ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచాం**

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**



పెండింగ్ బిల్లులు కూడా

## త్వరలోనే చెల్లిస్తాం

**బిఆర్ఎస్ వదిలిన మూడు డిఎలు కూడా చెల్లిస్తాం**

**బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు**

**ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. తరువాయి 2లో

ఆందోళనకరంగా

## పశ్చిమాసియా పరిస్థితి

**యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు**

**లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి**



న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగు తోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరా లను పశ్చి మాసియా తీరు స్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు.ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్ల డించారు. పశ్చిమాసి యాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్ తరువాయి 2లో



## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

**డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం**

**దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం**

న్యూఢిల్లీ : నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది.

తరువాయి 2లో



ఇది స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు..

## స్టీల్ సిటీకి ఫౌండేషన్

**ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు..స్పీడ్ ఆఫ్ డూయింగ్**

**ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు**

**ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది**

**స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు**

అనకాపల్లి : ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. తరువాయి 2లో

సుదీర్ఘకాలంగా

## ప్రజా సేవలో మోడీ

**అభినందనలు తెలుపుతో ఎక్స్‌లో పవన్ పోస్ట్**



అమరావతి :

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధిపతిగా నిరవధికంగా 8,931 రోజుల సేవ పూర్తి చేసిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోడీ రాజకీయ ప్రయాణం, భారత ప్రధానిగా కొనసాగుతూ దేశానికి విశేష సేవలు అందించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పదవిలో గడిపిన కాలం మాత్రమే కాకుండా, అచంచల సంకల్పం, అలసటలేని కృషి, దేశ సేవకు అంకితమైన జీవితం ప్రధాని మోడీని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని ఆయన అభిప్రాయపడ్డారు పవన్ కల్యాణ్.. తరువాయి 2లో

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

హైదరాబాద్ : విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. సీపెక్ సర్వే ప్రకారం రూ. 5 లక్షల బీమా ఆయా కుటుంబాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దనే భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఉద్యోగుల భద్రతకు, వారి కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటి చెప్పామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్, సింగరేణి కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక ప్రమాద బీమా పథకం కింద భారీ మొత్తాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఒర్సు సురేశ్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఉద్యోగి. ముక్తార్ బేగ్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉద్యోగి. వీరి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు.

## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. 'బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా?నాఫెడ్‌కు అనుమతి ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా?ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తున్నారా?లేదా?బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతులపై తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం సాగింది. ఫిలిప్పైన్ తో కు బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ఫిలిప్పిన్స్ తో ఒప్పందం కోసం గార్గ్ ను అడ్వైజర్ గా పెట్టుకున్నారని.. గార్గ్ అనే వ్యక్తి ఈడీ ,సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నాడని ఆరోపించారు. బియ్యం ఎగుమతుల కోసం ఎంఓయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో 7 వేల 500 మెట్రిక్ టన్నుల బియ్యం .. ఏడాదిగా ముక్కిపోయాయని విమర్శించారు. బియ్యం ఎగుమతితో సివిల్ సప్లైస్ శాఖకు కోట్ల నష్టం జరిగిందని ఆరోపించారు. బియ్యం ఎగుమతిపై హౌస్ కమిటీ వేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. హరీశ్ వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. ఫిలిప్పిన్స్ తో బియ్యం ఎగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. బియ్యం ఎగుమతులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం అని మండిపడ్డారు. ఏమీ తెలియకుండా స్కాం అంటూ హరీశ్ రావు ఆరోపిస్తున్నారని చెప్పారు. షిప్పింగ్ చార్జీలు, గోదాం ఛార్జీలు చార్జీలన్నీ ఫిలిప్పైన్స్ చూసుకుంటుందన్నారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజ కొంటున్నామని చెప్పారు. గత సర్కార్ కంటే ఎక్కువగా రైతులకు మేలు చేస్తున్నామని తెలిపారు. నేరుగా ఫిలిప్పైన్స్ మంత్రితోనే ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అగ్రి మెంట్ చేసుకుని బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నామని చెప్పారు ఉత్తమ్. మీరు సిఫారసు చేసిన వ్యక్తులకు బియ్యం ఇవ్వకుంటే స్కాం జరిగినట్టేనా అని హరీశ్ ను ప్రశ్నించారు ఉత్తమ్.

## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎ÷-లాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియోలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది ఎన్నికల పక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది. ఇటీవల ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ ఉంటుంది. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో మే 4న ఫలితాలు వెలువడతాయి.

## సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో మోడీ

'గ్రాస్ రూట్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి దేశాన్ని నడిపిస్తూ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చారు' అని పవన్ కల్యాణ్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ, త్యాగం, అపార కృషితో కొనసాగుతున్న నాయకత్వం దేశ అభివృద్ధికి దోహదపడిందని తెలిపారు. మౌలిక వసతులు, పేదల సాధికారత, డిజిటల్ మార్పులు వంటి రంగాల్లో ప్రధాని మోడీ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచడంలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ పాత్ర కీలకమని పేర్కొన్నారు పవన్ కల్యాణ్? ఈ మైలురాయి నిజమైన నాయకత్వం స్థిరత్వం, నిబద్ధత, స్వార్థరహిత సేవపై ఆధారపడుతుందని గుర్తుచేస్తుందని అన్నారు. ఇక, ప్రధాని మోడీకి మరింత ఆరోగ్యం, శక్తి కలగాలని, దేశసేవలో ఇంకా ఎన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు..



# మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం

జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ముందు జాగ్రత్త తీసుకోకుంటే ఢిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు.

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెల్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం

బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు.ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు. మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలా చెల్లించి 700 కోట్లను 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని భట్టి అన్నారు. తాము ప్రతి సమస్యనూ మానవీయ కోణంలోనే చూస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏ బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. అవన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలను గత ప్రభుత్వం చెల్లించలేదు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించలేకే పదవీ విరమణ వయసు పెంచారు. దీంతో మా ప్రభుత్వంపై అదనపు భారం పడింది. గత ప్రభుత్వం రూ.40,154 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు కూడా రూ.4,571 కోట్లు బకాయిలు పెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తాం. మానవీయ కోణం ఉంది కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నాం అని చెప్పారు.

## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్

ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్‌ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీ మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ఎ÷-లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్‌ఎ÷-లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷-లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు.

## రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదే

మాకు సరిపోతోందని అంటూ ఆమె ఎద్దేవా చేశారు.హరీష్ రావు తన నియోజకవర్గంలోనే రైతులకు అప్పులు ఉన్నాయని చెబుతున్నారని, మరి ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉండి కూడా పదేళ్లలో ఎందుకు రుణమాఫీ చేయలేకపోయారని సీతక్క ప్రశ్నించారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను వంచించిందని, ఇప్పుడు ఆరు నెలల తమ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమమే నిధులు, నియామకాల కోసం జరిగిందని గుర్తు చేసిన సీతక్క, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ గ్యారెంటీ ఇచ్చిందని నిలదీశారు. కేవలం నోటిఫికేషన్లు ఇస్తే సరిపోదని, తాము అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు , నూతనంగా ప్రకటించిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. మీరు పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో లెక్క చెప్పండి.. మేము ఈ రెండేళ్లలో ఎన్ని ఇస్తామో చూపిస్తాం అని ఆమె సవాలు విసిరారు. హరీష్ రావు పడుతున్న బాధ అంతా అధికారం పోయిందనే తప్ప, ప్రజల మీద ప్రేమతో కాదని సీతక్క వ్యాఖ్యానించారు. సీటు మారగానే చరిత్ర మారిపోదని, పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేయని పనుల గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల కోసం తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవద్దని ఆమె సూచించారు.

## పెన్షనర్లను వేధిస్తున్న ప్రభుత్వం

### వారి బకాయల చెల్లింపులో నిర్లక్ష్యం

### అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్,మార్చి23 : ప్రభుత్వ ఉద్యోగులు జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా , కల్వకుంట సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు రూ. 700 కోట్ల బకాయిలను చెల్లిస్తామని చెప్పి , ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారురని, 5 డీఏలు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలని కోరారు.

## దానం నాగేందర్ వ్యవహారంపై విచారణ

### నోటీసులు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్,మార్చి23 : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. దానం నాగేందర్ పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ తీర్పును కొట్టివేయాలని ఏలేటి పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన దానం నాగేందర్.. కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారని న్యాయస్థానం దృష్టికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీసుకొచ్చారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# భారీగా తగ్గిన బంగారం ధరలు

## యుద్ధ ప్రభావంతో దిగివస్తున్న రేట్లు

హైదరాబాద్,మార్చి23 : అమెరికా–ఇరాన్ మధ్య దాడులు ముదురుతుండటం, వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనల వల్ల ప్రపంచ మార్కెట్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దింతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. అమెరికా–ఇరాన్ యుద్ధం తీవ్రతరం కావడం, ముడి చమురు ధరలు అధికంగా ఉండటంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధం మొదలైన కొత్తలో అందరూ పోటీ పడి బంగారం కొనడంతో ధరలు ఆకాశానికి అంటాయి. ఇప్పుడు అంత రేటు పెట్టి ఎవరూ కొనలేక పోతుండటంతో ధరలు మెల్లగా దిగివస్తున్నాయి. ధరలు బాగా పెరిగినప్పుడు కొన్నవారు, ఇప్పుడు ఆ లాభాన్ని నగదుగా మార్చుకోవడానికి ఉన్న బంగారాన్ని అమ్మేస్తున్నారు. దీనివల్ల మార్కెట్లో బంగారం నిల్వలు పెరిగి ధరలు తగ్గుతున్నాయి. బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉండటంతో, ప్రజలు బంగారం మీద కంటే డిపాజిట్లు లేదా బాండ్ల మీద పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం మొదలైంది. ఇది కూడా వడ్డీ రేట్లు పెరగడానికి దారితీస్తోంది. సోమవారం 1 గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.595 తగ్గి రూ.14,002, 22క్యారెట్ల ధర రూ. 545 తగ్గి రూ. 12,835, 18 క్యారెట్ల ధర రూ.446 తగ్గి రూ.10,502. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.5,950 తగ్గి రూ.1,40,020, 22 క్యారెట్ల బంగారం ధర రూ.5,450 తగ్గి రూ.1,28,350, 18 క్యారెట్ల బంగారం ధర రూ.4,460 తగ్గి రూ.1,05,020 వద్ద చేరింది.

హైదరాబాద్,వరంగల్,నిజామాబాద్, ఖమ్మంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, కడప, అనంతపురంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర రూ.15 తగ్గి రూ.230, కేజీకి రూ.2,30,000 వద్ద రూ.15,000 తగ్గింది.

# రైతుభరోసా విడుదలపై ప్రజాప్రతినిధు కృతజ్ఞతలు

హైదరాబాద్,మార్చి23 : తొలి విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమచేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి విప్ లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభలో సిఎం కార్యాలయంలో వీరు సిఎంను కలిసి రైతులు పక్షాలన కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో రైతులకు సాయం అందచేయడం వల్ల వారికి ఊరట దక్కిందని అన్నారు. కాంగ్రెస్ రైతుల పక్షపాతం అని నిరూపితం అయ్యిందన్నారు.

# విద్యుత్‌శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణం

## రెడు కుటుంబాలకు కోటి చొప్పన చెక్కులు అందచేత

హైదరాబాద్,మార్చి23 : విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందజేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందేశారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి పది లక్షలకు పెంచాం. సీపెక్ సర్వే ప్రకారం తేలిన కుటుంబాలన్నింటికీ రూ. 5 లక్షల బీమా వర్తిస్తుంది కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దని భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చాం అని ఈ సందర్భంగా సిఎం అన్నారు.విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించాం అన్నారు. విద్యుత్ శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేశ్, ముక్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి చొప్పున చెక్కులు రేవంత్ రెడ్డి అందచేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టాం అన్నారు.

# ఆరు గ్యారెటీలకు చట్టబద్ధత

## అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు బిఆర్ఎస్ నోటీసు

హైదరాబాద్,మార్చి23 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

# ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

## రైతుబంధును 15 వేలు అని,12వేలకు కుదింపు

## బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయరా?

## బడ్జెట్‌పై చర్చలె బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్,మార్చి23 : గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని అన్నారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ' మొదటి బ్జడెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలి. బ్జడెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బ్జడెట్‌లో మాయమైంది. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బ్జడెట్‌లలో పెట్టారు. ఒక్కసారి కూడా ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బ్జడెట్‌లో చెప్పారు. ఈసారి ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. బ్జడెట్‌పై చర్చలో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గింటిందని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీష్‌రావు గుర్తుచేశారు. తొలి బ్జడెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దాన్ని రూ.12 వేలకు తగ్గించారని మండిపడ్డారు. మా ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక ఒక పంటకే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ.. రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.'మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్జడెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. రెండు బ్జడెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బ్జడెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బ్జడెట్‌లో చెప్పారని, ఈసారి బ్జడెట్‌లో ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా రూ.12 వేల కోట్లు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని రూ.46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని, ఊరూరుకు బార్లు ఓపెన్ చేస్తారా..? అని నిలదీశారు. దాంతో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో రూ.12 వేల కోట్లుగా ఎక్సైజ్ ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.36 వేల కోట్లు పెంచిందని అన్నారు. జూపల్లి కలుగజేసుకోవడంపై హరీష్‌రావు అసహనం వ్యక్తంచేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కగారు సమాధానం చెప్పాలని అన్నారు. తాను బ్జడెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన స్జబెక్టుపై కాదని చెప్పారు. ఈ సందర్భంగా తలసాని జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును విమర్శించారు.

# నేడు ప్రపంచ టిబి దినోత్సవం

## వాకథాన్‌లో ప్రజలో చైతన్యానికి కృషి

## నాపా ఆధ్వర్యంలో నేడు కెబిఆర్ పార్క్‌లో కార్యక్రమం

## వ్యాధిపట్ల ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపు

హైదరాబాద్,మార్చి23 : మాయమైందనుకున్న క్షయ వ్యాధి మళ్లీ విజృంభిస్తోంది. చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. కేంద్రప్రభుత్వం కట్టడి చర్యలు తీసుకుంటున్నా, ప్రజల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ వ్యాప్తిం చెందుతోంది. వ్యాధి బారిన పడ్డవారు సరిగా గుర్తించకపోవడం, వైద్యుల సలహాలు పాటించక పోవడం, సరైన చికిత్స తీసుకోక పోవడం వంటి కారణాలతో మళ్లీ వ్యాప్తి చెందుతోంది. ఈ క్రమంలో సామాజిక బాధ్యతయగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంగా ఏర్పడి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. 24న మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించబోతున్నారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంతి,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని,డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి మూడు నిముషాలకు ఇద్దరు వ్యక్తులు టిబి కారణంగా చనిపోతున్నారని, ఇది అత్యంత బాధాకరమైన విషయమని, ప్రజలు చైతన్యం కావాలని నాపా ప్రతినిదులు సూచించారు. టిబికి ఆధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉందని, ఇది క్యూరబుల్ అని అన్నారు. ప్రపంచ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది క్షయవ్యాధి బారినపడుతున్నారని అన్నారు.ఏళ్ళ తరబడి క్షయవ్యాధి అనేది వైద్యపరమైన చిక్కులు, సామాజిక మరియు ఆర్థిక ఇబందులు చూపుతుందని అన్నారు. ఈ క్షయవ్యాధి ప్రపంచ మరణానికి ప్రధాన కారణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేఏందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. వాడుక భాషలో టిబిగా పిలిచే క్షయ వ్యాధి వల్ల ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌కులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుందని అన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలన్నారు. తాము నిర్వహించే వాకథాన్ ప్రజల్లో చైతన్యం కలిగిస్తే అంతకు మించిన లక్ష్యం మరోటి లేదన్నారు.

# ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన

## తగ్గిన క్రూడాయిల్ ధరలు..పెరిగిన పసిడి

వాషింగ్టన్,మార్చి23 : అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేయడం.. ప్రతిగా తాము హర్మూజ్ పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ హెచ్చరికలతో యుద్ధం ఎటు వెళ్తుందోనన్న భయాలు నెలకొన్నాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమనగా.. బంగారం, వెండి ధరలు భారీగా క్షీణించాయి. అయితే అనూహ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కాల్పుల విరమణ ప్రకటించారు. ఆ దేశ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేయాలని తమ బలగాలను ఆదేశించినట్లు చెప్పారు. దీంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పతనం కాగా.. తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మళ్లీ ఇరాన్‌పై దాడులను తాత్కలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు దిగి వచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 13 శాతం మేర పతనమై 96 డాలర్ల స్థాయికి చేరింది. అంటే ఒక్క ప్రకటనతో 17 డాలర్ల మేర దిగొచ్చింది. అలాగే, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సైతం 13 డాలర్లు క్షీణించి 85 డాలర్ల స్థాయికి చేరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు సోమవారం ఉదయం భారీగా పతనమయ్యాయి. ద్రవ్యోల్బణ భయాలు, డాలరు బలోపేతం కావడంతో వీటి విలువలు భారీగా క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ఓ దశలో 4099 డాలర్లకు చేరింది. ట్రంప్ ప్రకటనతో మళ్లీ బంగారం పుంజుకొంది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి 4474 డాలర్లకు చేరింది. వెండి ఔన్సు 70 డాలర్లకు సమీపించింది. ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల ఓ దశలో రూ.1.36 లక్షలు పలకగా.. రాత్రికి మళ్లీ రూ.1.46 లక్షలకు చేరింది. వెండి కిలో రూ.2.10 లక్షల నుంచి రూ.2.32 లక్షలకు పెరిగింది. ఇదే ప్రకటన స్టాక్ మార్కెట్ ముగియక ముందు వచ్చి ఉంటే మన మార్కెట్‌లు కూడా భారీ నష్టాల నుంచి గ్టటెక్కి ఉండేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గిఫ్ట్ నిఫ్టీ ప్రస్తుతం 920 పాయింట్లకు పైగా లాభంతో 23,391 వద్ద ట్రేడవుతోంది. ఈ లోపు ఎలాంటి ప్రకటనా రాకపోతే మంగళవారం మన మార్కెట్లు దూసుకెళ్లడం ఖాయం అని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# మత్స్యకారుల రోణకు చర్యలు

## ఏప్రిల్ 15 నుంచి సముద్రంలో వేట నిషేధం: ఆనం

నెల్లూరు,మార్చి23 : ఆంధ్రా ప్రాంత మత్స్యకారుల రక్షణకు ఎంతటి వరకైనా వెళ్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి మత్స్యకారుల దాడులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏపీ మత్స్యకారులకు సంపూర్ణంగా అండగా ఉంటామన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి ఆనం సమీక్ష నిర్వహించారు. మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మాస్టర్ ఎ÷–లాన్ రూపొందిస్తున్నామన్నారు. మత్స్యకారుల సమస్యపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. హైపవర్ బోట్లతో మన సంపదను పొరుగురాష్ట్రాల మత్స్యకారులు దోచుకుంటున్నారు. సముద్ర జలాలపై గస్తీ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. ఏప్రిల్ 14 వరకు సముద్ర జలాల్లో గస్తీ ఉంటుంది. ఏప్రిల్ 15 తర్వాత రెండు నెలల పాటు వేట నిషేధం అమల్లో ఉంటుంది. సీఎం ఆదేశాలతో రేపు ప్రత్యేక బృందం నెల్లూరు జిల్లాకు వస్తోంది‘ అని మంత్రి తెలిపారు.

## కుర్తాళం పీఠాధిపతి ఆశీర్వాదం పొందిన ప్రభాకర్

హైదరాబాద్,మార్చి23 : తమిళనాడు కుర్తాళం పీఠాధిపతిశ్రీశ్రీశ్రీ దత్తేశ్వరానందస్వామి వారిని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ కలుసుకున్నారు. స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. స్వామిని కలిసి పలు విషయాలు చర్చించారు.

# తెలంగాణ కేబినేట్ భేటీ

## పలు బిల్లులపై చర్చించిన మంత్రివర్గం

## గిగ్ వర్కర్లకు రోణగా బిల్లు తెచ్చే ప్రతిపాదన

## మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయం

## అడ్వకేట్స్ రక్షనకు చట్టం రూపొందించే ఆలోచన

## సిఎం రేవతం అధ్యక్షతన కేబినేట్ భేటీలో పలు నిర్ణయాలు

హైదరాబాద్,మార్చి23 : ఈ అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టా÷–లసిన మొత్తం 10 కీలక అంశాలపై కకేబినేట్‌లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సభలో ప్రవేశపెట్టాల్సిన మూడు ముఖ్య బిల్లులపై కేబినెట్ సభ్యులు సమగ్రంగా చర్చించారని సమాచరం. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమ బిల్లుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. రాష్ట్రంలో సుమారు 3 నుంచి 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం చేకూరేలా ఈ బిల్లును రూపొందించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లులో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కోర్ అర్బన్ యాక్ట్ డ్రాఫ్ట్ బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ కొనసాగినట్లు సమాచారం. మొత్తంగా ఈ కేబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.విద్వేషపూరిత ప్రసంగాలు.. నేరాల నిరోధక బిల్లు, తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు, తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లులకు ఆమోదం తెలిపింది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో స్వాధీన పక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం తరఫున లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించింది. కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించే బాధ్యత క్యాబినెట్ సబ్‌కమిటీకి అప్పగించింది. రోహిత్ వేముల చట్టం విధివిధానాల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ తీర్మానించింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహా, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు.

# కాంగ్రెస్ హామీలకు దిక్కులేదు

## మండిపడ్డ మాజీమంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల,మార్చి23 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎక్కడా కూడా అమలు కావడం లేదని బీఆర్ఎస్ నాయకుడు , మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం అంబేడ్కర్ కళా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి సగం రోజులు గడిచిపోయాయని, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, ఇంకెన్ని రోజులు ప్రజలను మభ్య పెడుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ అత్యంత అవినీతిమయమైందని, మంత్రులు మధ్య వాటా పంచాయితీ ఎప్పుడూ చూడలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజల సంక్షేమం,అభివృద్ధిపై పట్టింపు ఉండదని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రెండు లక్షల ఎనబై వేల కోట్లు మాత్రమే అప్పు చేసిందని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. మూడేండ్లు పూర్తి కాక ముందే మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసి ఏం చేశారని ప్రభుత్వాన్ని లక్ష్మారెడ్డి నిలదీశారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కడుతున్నామని అవాస్తవాలు చెబుతున్నారని విమర్శించారు. మూడున్నర లక్షల కోట్ల అప్పుతో మీరు చేసిన పనులు కనిపించడం లేదు. ప్రాజెక్టులు లేవు. సంక్షేమం లేదు. హామీల అమలు లేదని అన్నారు. రైతు భరోసా నిధులు మూడుసార్లు ఎగ్గొట్టి మోసం చేశారని ఆరోపించారు. బ్జడెట్ లో అంకెల గారడీతో అభివృద్ధి సాధ్యం కాదని, పేపర్ లో మాత్రమే అంకెలను అటు ఇటు మార్చి చెప్పినంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఫలితాలు రావని పేర్కొన్నారు

# నిమ్స్‌లో మందుల ధరలు కంట్రోల్ చేయండి

## మండలిలో ఎమ్మెల్సీ రమణ విమర్శలు

హైదరాబాద్,మార్చి23 : నిమ్స్ ఆస్పత్రిలో మెడిసిన్స్ ధర అధికంగా ఉంటున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ తెలిపారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రిలోనూ అదేవిధంగా అధిక ధరలు ఉంటున్నాయని పేర్కొన్నారు. బయటి మెడికల్ షాపు రేట్లతో సమానంగా మెడిసిన్స్ అమ్ముతున్నారని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనమండలిలో ఎల్.రమణ మాట్లాడుతూ.. మందులు కొనలేక పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వమే మందులు సరఫరా చేసి పేద రోగులకు ఉపశమనం కలిగించాలని కోరారు. అధిక ధరలకు మెడిసిన్స్ అమ్మే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎల్.రమణ డిమాండ్ చేశారు. సరిపడ స్టాక్ లేక బయటి మెడికల్ షాపులపై ఆధారపడాల్సి వస్తుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు

# హామీల అమలులో చిత్తశుద్ధిలేని కాంగ్రెస్ ప్రభుత్వం

## మధుసూధనాచారి విమర్శలు

హైదరాబాద్,మార్చి23 : ప్రజలకు ఇచ్చిన హామీలే కేంద్ర బిందువుగా అసెంబ్లీలో చర్చ జరగాలని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటనేది చూడకుండా ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. శాసనమండలి, శాసనసభను వాయిదా వేసుకుంటూ పోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అధికార పక్షాన్ని నిజాయితీగా ప్రశ్నించాలని అనుకుంటున్న పార్టీలు తమతో కలిసి రావాలని మధుసూదనాచారి పిలుపునిచ్చారు. హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని నిజాయితీ, చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతులు అప్పుల్లో కూరుకుపోకుండా పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్న ఆలోచన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హామీల అమలుపై ఎక్కడికక్కడ నిలదీస్తున్నామని మధుసూదనాచారి తెలిపారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీది ద్రోహం, వంచన అని మండిపడ్డారు. ఏడాదికి రూ.20వేల కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. బీసీలకు కాంగ్రెస్ బ్జడెట్‌లో కేటాయింపులు ఎలుక తోకలా ఉందని ఎద్దేవా చేశారు. బీసీలకు గత బ్జడెట్‌లలో కేటాయించిన నిధుల్లో సగం కూడా ఖర్చు చేయలేదని అన్నారు.

# సంపాదకీయం

## క్షయతో మూడు నిముషాలకో ఇద్దరు మృతి

ఒకప్పుడు క్షయవ్యాధి సోకితే మరణం తప్పేది కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడం, సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు ఇవ్వడం వల్ల, చికిత్స చేయడం వల్ల క్షయను అరికట్టడం సాధ్యమయ్యింది. అయినా నేటికీ మూడు నిముషాలకో ఇద్దరు క్షయవ్యాధితో మరణిస్తున్నారన్న గణాంకాలు చూస్తే భయమేస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యంతో పాటు, సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వంటి కారణాలని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24న పాటిస్తారు. టీబీ వ్యాధిపై అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1882లో డా. రాబర్ట్ కోచ్ టీబీ బాసిల్లస్ క్షయ వ్యాధి కారకంను కనుగొన్న రోజుగా దీనిని జరుపుకుంటారు. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటిసారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 100 సంవత్సరాలైన సందర్భంగా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించింది.భయంకరమైన అంటువ్యాధైన టీబీ దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు దేశవ్యాప్తంగా 1000మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962ను క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. క్షయవ్యాధి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై దాడి చేస్తుంది. దగ్గు, తుమ్ముల ద్వారా గాలిలో వ్యాపిస్తుంది. 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు మరియు బరువు తగ్గడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. 6-9 నెలల పాటు డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడితే ఇది పూర్తిగా నయమవుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుంది. క్రియాశీల పల్మనరీ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తులే ఈ వ్యవధి వ్యాప్తికి మూలం. నిజానికి ప్రస్తుతం క్షయకు అత్యాధునిక చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రజలు క్షయ గురించి ఇంకా అవగాహన కలిగించకోవడం లేదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకుంటే అటు వ్యక్తికే గాకుండా, సమాజా ఆరోగ్యానికి కూడా దోహదపడ్డవారు అవుతారు. 2016లో 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకగా 2.5 లక్షల మంది పసివాళ్లు ప్రాణాలు కోల్పోయారంటే నమ్మశక్యం కాని విషయం. ప్రపంచం లోనే వందలో 4వ వంతు జనాభాలో క్షయ బ్యాక్టీరియా ఉందంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపించి ఉందో అర్థం చేసుకోవచ్చు. టిబి వ్యాధిగ్రస్తులు మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ భారత్ లో విస్తరిస్తున్న అనేక వ్యాధుల్లో ఈ క్షయ వ్యాధి ఒకటి. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులకు సంబంధించినదే అయిన చర్మం నుంచి మెదడు వరకు శరీరంలోని ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. క్షయ వ్యాధి ముఖ్యంగా శ్వాసకోశాన్ని దెబ్బ తీస్తుంది. ఈ వ్యాధి బారినపడి ఇప్పటికీ ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నుంచి గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ చుక్కల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది.క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పడుతుండడం మరియు కఫంలో రక్తం వంటి లక్షణాలు 2 వారాలకు మించి ఉంటాయి. ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపించడమే కాక, నొప్పి మరియు ప్రభావిత ప్రాంతాల్లో వాపు వస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి వంటి సమస్యలు కూడా సంభవిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి తుగ వైద్యసూచనలు పాటించాలి. లేకుండే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారలోపం మరియు సిలికోసిస్ ఉన్నవారి లోనూ ఈ వ్యాధి సోకుతుంది. ప్రజల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు ఎనిమిది దేశాల్లో ఉన్నాయి, భారత్ అగ్రస్థానంలో ఉంది. క్షయ నివారణ మరియు నివారించదగినదని వైద్యులు అంటున్నారు. వ్యాధి ఉన్న వ్యక్తి యొక్క అంటువ్యాధి అతను లేదా ఆమె గాలిలోకి విడుదల చేసే ట్యూబర్‌కిల్ బాసిల్లి సంఖ్యకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. అనేక ట్యూబర్‌కిల్ బాసిల్లిని బహిష్కరించే వ్యక్తులు తక్కువ లేదా బాసిల్లిని బహిష్కరించే రోగుల కంటే ఎక్కువ అంటువ్యాధి కలిగి ఉంటారు.సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే, సక్రమంగా మందులు వాడితే వ్యాధిని అదుపు చేయవచ్చని అంటున్నారు. జీవనశైలి మార్పులు కూడా ఈ కాలంలో వ్యాధిని నిర్మూలిం చడంలో సహాయపడతాయి. క్షయ అనేది చికిత్స చేయగల మరియు నయం చేయగల వ్యాధి. సమయానికి మందులను తీసుకోవడం వల్ల రక్తంలో ఔషధం యొక్క ఖచ్చితమైన ఏకాగ్రత స్థాయిని కొనసాగించవచ్చు. వ్యాధికారక క్రిములను చంపడానికి ఇది చాలా అవసరం. చాలా మంది రోగులు చికిత్స కొనసాగుతుండగా మెరుగైన పరిస్థితి కనిపించడంతో, అటువంటి రోగులు కొన్నిసార్లు చికిత్స చేస్తున్న వైద్యుడిని సంప్రదించకుండా వారి స్వంత చికిత్సను ఆపడానికి ఆకర్షితులవుతారు. ఇది హానికరం మరియు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ క్షయవ్యాధి అభివృద్ధికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానం చేయవద్దు. మీరు మందులు తీసుకునేటప్పుడు ధూమపానం చేస్తే, అది మీ చికిత్సను ప్రభావితం చేయవచ్చని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికిత్సకు కొన్ని మందులు కాలేయానికి హాని చేస్తాయి. వీటిని తీసుకుంటూ మద్యం సేవించడం వల్ల కాలేయంపై అదనపు భారం పెరుగుతుందని అంటున్నారు. ఏదేమైనా చికిత్స చేయించుకోవడం, వ్యాధిని గుర్తించడం, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడడం వంటి వాటి వల్ల వ్యాధిని అరికట్ట వచ్చని అంటున్నారు. కేంద్రం కూడా క్షయ నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది.

# బుల్లెట్ నుంచి బ్యాలెట్ వైపు



పీపుల్స్ వార్ ప్రభావిత ప్రాంతపు గోడలపై 'పార్లమెంట్ పందులదొడ్డి' అనే నినాదం కనబడేది. ఎన్నికల ద్వారా కాకుండా, సాయుధ విప్లవం ద్వారానే సామాన్యుల ఆకాంక్షలు నెరవేరే పాలన దేశంలో సాధ్యపడుతుందని ఆ పార్టీ నమ్మినందువల్ల ఆ నినాదాన్ని ప్రచారంలోకి తెచ్చింది. 2004లో మరో విప్లవ పార్టీతో కూడిన పీపుల్స్ వార్.. మావోయిస్టు పార్టీగా అవతరించినా అదే మాటపై కట్టుబడి ఉంది. దేశంలో ఎన్నికలు వచ్చిన సమయంలో 'ఎన్నికలను బహిష్కరించండి' అని పిలుపునిచ్చేది. అలాంటి ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించడం సిబ్బందికి కత్తిమీద సాములా ఉండేది. ఒడిశా రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత 11 జిల్లాల్లో 1998 నుండి 25 ఏళ్ల పాటు ఏ ఎన్నికా ప్రశాంతంగా జరగలేదు. 2024లో మాత్రమే మావోయిస్టుల చర్యలు లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా సాధ్యపడింది అని అక్కడి పత్రికలు రాశాయి. ఇవే పరిస్థితులు చత్తీస్‌గఢ్‌లోను కొనసాగాయి. రవాణా సౌకర్యం సరిగ్గా లేని అటవీప్రాంతాల్లో ఎన్నిక నిర్వహణ ఓ యుద్ధ వాతావరణాన్ని తలపించేది. 2017లో వచ్చిన న్యూటన్ అనే హిందీ సినిమాలో చత్తీస్‌గఢ్ గ్రామీణ ప్రాంతంలో ఎన్నికల నిర్వహణ బహిష్కరణకు సంబంధించిన సన్నివేశాలు చూడవచ్చు. మరో సంఘటన ఏమిటంటే చత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన తీవ్రవాద యువతకు అక్కడి ప్రభుత్వం ఉద్యోగాల్లో భర్తీ చేసుకుంది. ఓటేసినట్లు వేలుకి ఇంకు కనబడితే ఆ వేలుని నరికేస్తామని గ్రామీణులను హెచ్చరించిన వ్యక్తి ఇప్పుడు ఎన్నిక సిబ్బందిలో ఉంటూ ఆ వేలుకు ఇంకు పూయడం సమూల మార్పుకు నిదర్శనంగా భావించాలి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ప్రభుత్వాల ముందుకు వచ్చిన మావోయిస్టు నేతలు న్యూస్ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తమ భవిష్యత్ కార్యక్రమాల గురించి వారిని ప్రశ్నించినపుడు తమ పార్టీపై నిషేధం ఎత్తివేయాలని ముఖ్యమంత్రిని కోరామని, అదే సాధ్యపడితే చట్టపరిధిలో తమ పార్టీ పని చేసేలా చూస్తామని వారు అంటున్నారు. బుల్లెట్‌పై నమ్మకం పోయినవారు బ్యాలెట్ మార్గాన్ని ఆచరిస్తారా అనే విషయంపై ఇంకా స్పష్టత అవసరం. ఎన్నికల్లో పాల్గొంటారా అని ఒకరు అడిగిన ప్రశ్నకు అది భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఓటర్లకు పంచడానికి కోట్లలో ధనం వాడుతున్నారు అని సమాధానం వచ్చింది. సాయుధ పోరాటానికి స్వస్తి పలికామని చెబుతున్న వారు ఎన్నికల బహిష్కరణను కూడా విరమించుకున్నారా అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి.ఎన్నికల విషయంలో అన్ని నక్సలైటు పార్టీలు ఒకే విధానాన్ని పాటించడం లేదు. 1980 నుండి చంద్ర పుల్లారెడ్డి ఎన్నికల్లో పాల్గొంటుంది. 1970 ప్రాంతం నుండి ఉత్తర తెలంగాణలో తమ విప్లవ కార్యకలాపాలకు నెరిపిన సిపిఐ (మార్క్సిస్టు లెనినిస్టు) పార్టీకి చంద్ర పుల్లారెడ్డి నాయకత్వం వహించేవారు. గ్రామాల్లో వేళ్లూనుకుపోయి ఉన్న వెట్టి చాకిరీ, దొరతనం పోవాలన్నా, అప్పులు ఇచ్చి లేదా బెదిరించి గుంజుకున్న భూములు విముక్తి కావాలన్నా గడీలపై దాడులు తప్పనిసరి. అందుకోసం ఊర్లలో వివిధ సంఘాలను ఏర్పరచి యువకులను సమాయత్తం చేసింది. గ్రామాల్లో నక్సలైట్ ఉద్యమ బహిరంగ కార్యకలాపాలు ఉధృతం అయ్యాక భూస్వామ్య వర్గాలు విప్లవ సంఘాల ప్రతినిధులపై దాడులకు పాల్పడ్డాయి. వాటిని తిప్పి కొట్టేందుకు వర్గ శత్రు నిర్మూలన అవసరమనే చర్చ పార్టీలో మొదలైంది. అలాంటి సైద్ధాంతిక, ఆచరణాత్మక విభేదాల కారణంగా పార్టీ 1980 ప్రాంతంలో నాయకుల పేరిట వర్గాలుగా చీలిపోయింది. పీపుల్స్ వార్ పేరిట ఏర్పడ్డ చీలిక వర్గానికి కొండపల్లి సీతారామయ్య నాయకుడు. పుల్లారెడ్డి వర్గం ఎన్నికల్లో పోటీ చేయగా కెఎస్ గ్రూపు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూ అదే మార్గాన్ని కొనసాగిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం ముందు లొంగిపోతున్న మావోయిస్టులు నాటి కెఎస్ గ్రూపుకు చెందినవారే. డబ్బుతో కూడుకున్న ఎన్నికల్లో ఓటర్ల మద్దతు కూడగట్టుకోవడం సామాన్యమైనది కాదు. అదే గ్రూపుకు చెందిన ఎన్‌వి కృష్ణయ్య 1989 లో సిరిసిల్లా నియోజకవర్గంనుండి ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. సిపిఐ (మా లె) న్యూడెమోక్రసి నుండి ఒకరు ఐదు పర్యాయాలు ఎంఎల్ఎగా గెలవడం నక్సలైట్ల చరిత్రలోనే ఓ మైలురాయి. ఆ పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు లేనందువల్ల స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గుమ్మడి నర్సయ్య 1983 నుండి (ఒక టర్మ్ మినహా) 2009 వరకు ఇల్లెందు ఎంఎల్ఎగా ఉన్నారు. సైకిలుపై తిరుగుతూ ప్రజలతో కలిసి ఉండే ప్రజాప్రతినిధిగా ఆయనకు ఎంతో పేరుంది. ఈయన జీవిత కథ సినిమాగా వస్తోంది. ఎన్నికలకు డబ్బే సర్వస్వం అయిన ఈ రోజుల్లో ప్రజలతో కలిసి ఉన్నవారు చట్ట సభల్లో అడుగు పెట్టచ్చు అనడానికి వీరే తార్కాణాలు. ౹ాశ్రీంశీ =ఋఎ - ఇజ్రాయెల్ అణ్వస్త్రదాడి చేసేనా? సాధారణంగా లొంగిపోయిన నక్సలైట్లు సొంత జీవితం గడుపుతుంటారు. రాజకీయాల్లో చేరాలనుకొనేవారు తక్కువే. అయితే ఇప్పుడు లొంగిపోయినవారు సారథులు. వారి రాకతో పోరుబాటకు తెర పడింది అని చెప్పవచ్చు. వందల్లో లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులే కాకుండా వారి కార్యకలాపాలకు రహస్యంగా సాయపడినవారు కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటారు. మైదాన ప్రాంతాల్లో సానుభూతిపరులు ఇంకా పార్టీ వెంటే ఉండవచ్చు. ఇంత నెట్ వర్క్ ఉన్న మావోయిస్టు నేతలు తమ కార్యకలాపాలు లీగల్‌గా కొనసాగించేందుకు అవకాశాలు మెండుగానే ఉన్నాయనిపిస్తోంది. ప్రజాభిమానం ఉంటే డబ్బు లేకుండానే ఎన్నికల్లో కూడా గెలవవచ్చని తోటి కామ్రేడ్స్ ఇప్పటికే నిరూపించారు. యాభై ఏండ్ల ప్రజాజీవితాన్ని తిరిగి ఆ ప్రజల కోసమే వెచ్చించేందుకు ఎన్నో ద్వారాలు తెరిచి ఉన్నాయి. భారీ బహిరంగ సభలను నిర్వహించిన అనుభవం వారికుంది. తమ సరికొత్త నిర్ణయాలు ప్రకటించేందుకు ప్రభుత్వ అనుమతితో ఓ సభ నిర్వహిస్తే ప్రజల స్పందన తెలిసే అవకాశం ఉంది. ఆయుధం వదిలేసినా ప్రజల్లోనే ఉండి, వారి కోసం చట్టపరిధిలో ఉద్యమాలు కొనసాగిస్తామన్నవారి మధ్య నిర్మాణాత్మకమైన సుదీర్ఘ చర్చలు జరగాలి. ప్రజల సమస్యలపై నిజాయితీగా పోరాడే శక్తుల అవసరం ఇప్పుడు తెలంగాణ సమాజానికి ఉంది.

## డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి'

### మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

కడప,మార్చి23 : డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి' అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు వివాదంపై కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కడప జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో చిక్కుకోవడంపై క్లారిటీ ఇచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనపై సుధాకర్ యాదవ్ స్పందించారు. తన కుమారుడిపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీకి ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ వెళ్లిన మాట నిజమేనని పుట్టా సుధాకర్ యాదవ్ అంగీకరించారు. అయితే, తన కుమారుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని, ముఖ్యంగా డ్రగ్స్ తీసుకునే అలవాటు అస్సలు లేదని స్పష్టం చేశారు. మహేశ్ వద్ద నుంచి కనీసం బ్లడ్ శాంపిల్స్ తీసుకోకుండానే రిపోర్టులో పాజిటివ్ అని ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ధారణ పక్రియపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి సమర్పించినట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెల్లడించారు. పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోందని, ఇన్వెస్టిగేషన్ ముగిశాక అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత, మహేశ్ నిరపరాధి అని నిరూపించే అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.


## మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం

### క్యూనెట్ సంస్థ వ్యవహారాలపై సిపి సజ్జన్నార్

హైదరాబాద్,మార్చి23 : క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. సోమవారం క్యూనెట్ కేసుకు సంబంధించి బషీర్‌బాగ్ సీసీఎస్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 1998 నుంచి క్యూనెట్ నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రొడక్ట్ ముందు చూపెడుతూ వెనకాల మోసం చేసి డబ్బులు దండుకోవడమే క్యూనెట్ సంస్థ నిర్వాహకుల టా÷-గ్గ÷ట్ అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించామని తెలిపారు. సిద్దిపేటలో హరికృష్ణ అనే బాధితుడు రూ.5 లక్షలు మోసపోయారని అన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యూనెట్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారించామని చెప్పుకొచ్చారు. క్యూనెట్ సంస్థ చెప్పేది ఒక్కటని, చేసేది ఇంకొకటంటూ బాధితుడు సూసైడ్ నోట్ రాసి చనిపోయారని అన్నారు. వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్త్‌ఫుడ్స్ తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. క్యూనెట్ సంస్థలో చేరే వ్యక్తులకు ముందు ఇష్టపూర్వకంగా చేరుతున్నామని బాండ్ పేపర్లపై రాయించు కొన్న తర్వాతే ఈ సంస్థలోకి తీసుకుంటారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టా÷-గ్గ÷ట్ చేస్తూ వాళ్లకు ప్రొడక్ట్ చూపెట్టి సైడ్ ఇన్‌కమ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారన్నారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్గ÷నాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని తెలిపారు. నెలరోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి పూర్తి స్థాయిలో ఆధారాలను సేకరించి అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు.


## ప్రజలకు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చ జరగాలి: మధుసూదనాచారి

ప్రజలకు ఇచ్చిన హామీలే కేంద్ర బిందువుగా అసెంబ్లీలో చర్చ జరగాలని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటనేది చూడకుండా ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. శాసనమండలి, శాసనసభను వాయిదా వేసుకుంటూ పోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అధికార పక్షాన్ని నిజాయితీగా ప్రశ్నించాలని అనుకుంటున్న పార్టీలు తమతో కలిసి రావాలని మధుసూదనాచారి పిలుపునిచ్చారు. హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని నిజాయితీ, చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతులు అప్పుల్లో కూరుకుపోకుండా పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్న ఆలోచన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హామీల అమలుపై ఎక్కడికక్కడ నిలదీస్తున్నామని మధుసూదనాచారి తెలిపారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీది ద్రోహం, వంచన అని మండిపడ్డారు. ఏడాదికి రూ.20వేల కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. బీసీలకు కాంగ్రెస్ బడ్జెట్‌లో కేటాయింపులు ఎలుక తోకలా ఉందని ఎద్దేవా చేశారు. బీసీలకు గత బడ్జెట్‌లలో కేటాయించిన నిధుల్లో సగం కూడా ఖర్చు చేయలేదని అన్నారు.



## సత్సంకల్పంతోనే సార్థకత

ఏ పనికైనా సంకల్ప శుద్ధి అవసరం. మన ఆచరణలు సంకల్పాలపైనే ఆధారపడి ఉంటాయి. సంకల్పానికి అనుగుణంగానే ప్రతిఫలం లభిస్తుంది. మనిషి మంచి ఉద్దేశాన్ని బట్టి అతనికి అల్లాహ్ మంచి చేస్తాడు. మనిషిది దుష్ట సంకల్పం అయితే అతనికి దక్కేది దుష్ఫలితమే! అందుకే ఏ పనిచేసినా దేవుడి ప్రసన్నతను దృష్టిలో ఉంచుకొని చేయాలి. మన అంతరంగాన్ని ఎల్లవేళలా అల్లాహ్ గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తెరిగి కార్యాలు చేపట్టాలి. మన సంకల్పాన్ని పాడు చేసే విషయాల నుంచి మన అంతరంగాన్ని కాపాడుకోవడం అందరికీ అత్యవసరం. భార్యాపిల్లల సేవ కన్నా తల్లిదండ్రుల సేవకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. కార్మికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి. దైవ మార్గంలో ధనాన్ని ఖర్చు చేసేటప్పుడు సన్నిహిత బంధువులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక వ్యక్తి మంచి పని చేయాలని సంకల్పించుకొని%ా% ఆ పని చేయలేకపోయినా, అతనికి పుణ్యఫలం దక్కుతుంది. మంచి సంకల్పంతో తమ బాధ్యతలు నెరవేర్చిన వారికే అల్లాహ్ స్వర్గలోక ప్రవేశం కల్పిస్తాడు.



ఆధ్యాత్మికం

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

## కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

◆ సిసిఎంఎస్ ను సంబంధిత శాఖ అధికారులు వినియోగించాలి ◆ ప్రభుత్వ కార్యాలయాల్లో పనికి రాని పాత సామాగ్రి తొలగించాలి ◆ పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై రిపోర్ట్ అందించాలి ◆ క్రిటికల్ కేర్ సెంటర్, నంది మేడారం సి.హెచ్.సి ప్రారంభానికి చర్యలు ◆ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ పై అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి జిల్లా అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో స్టాఫ్ కదలికల పై జిల్లా అధికారులు పక్కా నిఘా ఉంచాలని , కార్యాలయ విధులకు సకాలంలో హాజరు కావాలని, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన పక్షంలో దానికి సంబంధించిన వివరాలతో కూడిన రికార్డు మెయింటెన్ చేయాలని అన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా చేపట్టిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం ఆశించిన పురోగతి సాధించ లేదని అన్నారు. ప్రతి కార్యాలయం సంబంధించి పెండింగ్ ఫైల్స్ డిస్పోజల్, వివరాలతో కూడిన రిపోర్ట్ అందించాలని అన్నారు. ప్రతి కార్యాలయంలో పాత కంప్యూటర్, సామాగ్రి పూర్తి స్థాయిలో తొలగించాలని అన్నారు.కోర్టు కేసుల మానిటరింగ్ కోసం ఏర్పాటు చేసిన సి.సి.ఎం.ఎస్. సిస్టం ను అధికారులు వినియోగించాలని, సి.సి.ఎం.ఎస్ లో ప్రతి శాఖ తమ పరిధిలో పెండింగ్ ఉన్న కోర్టు కేసులను నమోదు చేయడంతో పాటు, సంబంధిత కేసులలో జరిగే పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో విద్యా సంస్థలను తనిఖీ చేస్తూ పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని అన్నారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి శాఖ ఫీల్డ్ లెవెల్ ఇన్స్ పెక్షన్ చేయాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గా నియమితులయ్యారని, ప్రోటోకాల్ ప్రకారం ఎంపీ ఎమ్మెల్యేల కంటే ప్రభుత్వ విప్ ముందు ఉంటారని, అభివృద్ధి పనులకు సంబంధించి శిలా ఫలకాలు ఏర్పాటు చేసే సమయంలో ఒక్కసారి రెవెన్యూ అధికారులతో ప్రోటోకాల్ ఫైనల్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పంచాయతి అధికారికి సూచించారు. త్రాగునీటి సరఫరా మెరుగ్గా అందించేందుకు గ్రామాల్లో ఉన్న నీటి సరఫరా పథకాలు మరమ్మత్తు ప్రాధాన్యత ప్రకారం చేపట్టాలని అన్నారు. గ్రామాలలో చేపడుతున్న త్రాగునీటి సరఫరా పనులకు సంబంధించి ప్రచారం సరిగ్గా ఉండాలని, ఓ.హెచ్.ఎస్.ఆర్ నిర్మాణం చేపడితే స్థానిక ఎమ్మెల్యే లేదా ప్రజా ప్రతినిధులు ఆహ్వానించి శంకుస్థాపన చేయాలని అన్నారు. 263 గ్రామ పంచాయతీలకు శాస్త్ర వేత్తలతో కూడిన 10 బృందాలు పర్యటించి పంట మార్పిడి విధానం, ఆధునిక సాగు పద్ధతులు, యూరియా వాడకం తగ్గింపు వంటి పలు



అంశాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్.బి.ఎస్.కే బృందాల ద్వారా మార్చి నెలాఖరు నాటికి గురుకుల విద్యార్థులు వైద్య పరీక్షలు పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలలో ప్రత్యేక వైద్య నిపుణులతో క్యాంప్ ఏర్పాటు చేసే సమయంలో ముందస్తుగానే ప్రచారం నిర్వహించే ప్రజలు ఆ క్యాంపు వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్యశాఖ పరిధిలో ఏప్రిల్ 6 నుంచి 11 వరకు చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా రామగుండం క్రిటికల్ కేర్ సెంటర్, నంది మేడారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్సారెస్పీ పరిధిలో రైతులకు ఆఖరి తడి నీరు చివరి ఆయకట్టు వరకు అందేలా చూడాలని అన్నారు.విద్యాశాఖ పరిధిలో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు.ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో నిర్వహించే 99 రోజుల కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, వివిధ పథకాల లబ్ధి వివరాలు గ్రామ సభ్యులలో చర్చ జరగాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే సమన్వయంతో పెద్ద ఎత్తున గృహ ప్రవేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నగర ప్రాంతంలో నూతనంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ముగ్గు పోసే పనులు కూడా ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక

● రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం ● సకాలంలో రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలి
● రబీ ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రబీ సీజన్ లో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు పై అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రబీ సీజన్ లో పెద్దపల్లి జిల్లా నందు లక్షా 77 వేల ఎకరాలలో వరి పంట సాగు జరుగుతుందని, వీటిలో 12 వేల ఎకరాలలో సన్న రకం ధాన్యం రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని, ఏప్రిల్ 15 నుంచి ప్రారంభించి మే నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం రవాణా నిమిత్తం అవసరమైన మేర వాహనాలు సిద్ధం చేయాలని, తేమ శాతం వచ్చిన తరువాత 24 గంటల వ్యవధిలో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు.గతంలో 20 వేల మెట్రిక్ టన్నుల కంటే అధిక ధాన్యం వచ్చిన కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు సెంటర్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. తేమ శాతం యంత్రాలు, ప్యాడీ క్లీనర్, వెయింగ్ యంత్రాలు కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని , యంత్రాలలో ఉన్న మరమ్మత్తులను వెంటనే సరి చేయాలని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం 1.1 కోట్ల గన్ని సంచులు అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు.మిల్లర్ల నుంచి 30 లక్షల గన్ని సంచులు సేకరణ చేయాలని అన్నారు. రాష్ట్రం నుంచి కొత్త గన్ని సంచుల స్టాక్



సకాలంలో జిల్లాకు చేరుకునేలా సమన్వయం చేసుకోవాలని అన్నారు. గన్ని సంచుల ఇబ్బంది జిల్లాలో రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. మన దగ్గర లక్ష మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం స్టోర్ చేసుకునేందుకు స్పెస్ ఉందని, మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం స్టోర్ చేసుకునేందుకు స్పెస్ గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, ఎటువంటి ఒత్తిడులకు గురి కావద్దని అన్నారు.రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ లను సకాలంలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకు గ్యారంటీ అందిస్తే సంబంధిత మిల్లులకు ముందస్తుగా ధాన్యం కేటాయింపు చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో మమ్మల్ని భయపెట్టలేరు...

### - బీజేపీ రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్

**సుల్తానాబాద్, మార్చి23 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ భారతీయ జనతా పార్టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హాజరవ్వడానికి సిద్ధమవుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్ ని పోలీసుకు తెల్లవారుజామున అరెస్టు చెయ్యడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి . ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ




హక్కులను అణగదొక్కేందుకు ప్రభుత్వం ఇలాంటి అక్రమ చర్యలకు దిగడం దారుణమని అన్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులను ముందుగానే నిర్బంధించడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సదయ్య గౌడ్ మండిపడ్డారు. అయితే ఇలాంటి అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపలేరని, రైతులు, నిరుద్యోగులు, మహిళల సమస్యలపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

# యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి: బామండ్ల రవీందర్

**గన్నేరువరం, మార్చి23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చీమలకుంటపల్లిలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ రాజ్ గురు సుక్ దేవ్ వర్ధంతిని తెలంగాణ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బామండ్ల రవీందర్ మాట్లాడుతూ..... నాడు దేశం కోసం పోరాడిన వీరులను బ్రిటిష్ వాళ్ళతో కలిసి దేశ ద్రోహులు చంపిస్తే,నేడు భూమి,భుక్తి విముక్తి కోసం పోరాడుతున్న ఎంతోమంది వీరులను అదే తరహాలో దేశ ద్రోహులు చంపిస్తున్నారన్నారు. నాడు వీరులను చంపినా స్వాతంత్రం ఆగలేదని,నేడు ఎంతోమందిని చంపినా భగత్ సింగ్ లాంటి వీరులు పుడుతూనే ఉంటారని కొనియాడుతూ దేశం, సమానత్వం కోసం అమరులైన వీరులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు బామండ్ల రవీందర్, నాయకులు భామండ్ల కనకయ్య,రాజయ్య పోశయ్య,నర్సయ్య, బోయిని రమేష్ ఆజాద్,పెంట నర్సయ్య, శ్రీనివాస్, కనక లక్ష్మి, మల్లవ్వ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

### - సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పని చేసే ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కార్యాలయంలో నిరుపయోగంగా (పాడైన) ఉన్న పాత స్కానర్, ప్రింటర్ మొదలైన సామాగ్రి తొలగించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఎక్కువ సమయం ఎదురు చూసేలా చూడవద్దని, వారి దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన ఏ. శ్యామల సర్వే నెంబర్ 12/ఆ/2, 47ఆ/5 లో తన భర్తకు భూమి ఉండేదని, తన భర్త మరణించినందున ఆ భూమి తన పేరు మీద విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ పెద్దపల్లి, తహసిల్దార్ ఎలిగేడు కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి మండలం పెద్ద కలువల గ్రామానికి చెందిన నారసాని వెంకటేష్ గ్రామంలో తనకు మీసేవ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత రెవెన్యూ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన తిరుపతి తమ గ్రామంలో అనర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేశారని, ప్రభుత్వ ఉద్యోగులు 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నవారికి రేషన్ కార్డు రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ విచారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ గుట్టను కాపాడండి....

### - అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలంటూ కలెక్టర్, మైనింగ్ ఏడీకి ఫిర్యాదు
### - జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో అక్రమ మట్టి తవ్వాకాలు చేపడుతూ, గుట్టలను కరిగిస్తున్నా వారి పై చర్యలు తీసుకోవాలంటూ ప్రజావాణిలో సోమవారం జాతీయ బీసీ సంఘం నేషనల్ కో ఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ఫిర్యాదు చేశారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఎల్లమ్మ గుట్ట, ఓదెల మండలంలోని కొలనూర్ గ్రామంలోని దన గుట్టను తవ్వుతున్నారని, రాత్రి పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు, మరియు లారీలతో, టిప్పర్లతో మొరాన్ని



కొల్లకొడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి, సదరు మట్టిని వెంచర్లల్లో ఉపయోగిస్తూన్నారని, దీంతో పర్యావరణం దెబ్బతినంటంతో పాటు, ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఆదాయం నష్టపోతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తక్షణమే క్షేత్రస్థాయిలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌లో గుట్టలను పరిశీలించి, అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓదెల కాంగ్రెస్‌లో ముదిరిన ముసలం

**● రచ్చకెక్కిన అంతర్గత ప్రజాస్వామ్యం ● మండల అధ్యక్షుడిపై కార్యకర్త వీడియో వైరల్ ● రసవత్తరంలో ఓదెల రాజకీయం**



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల అధికార కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిపై ఒక సామాన్య కార్యకర్త చేసిన వీడియో మండలంలో వైరల్ గా మారింది. భూ వివాదంలో జోక్యం చేసుకున్నాడు అంటూ చేసిన వీడియో హాట్ టాపిక్‌గా మారింది.

భూమి రిజిస్ట్రేషన్ ఆలస్యం అనే చిన్న విషయం ఏసీబీ స్థాయికి చేరడం రాజకీయ పరిజ్ఞానం కంటే అత్యుత్సాహం ఎక్కువైందనే విమర్శలకు దారి తీసింది.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే ఇప్పటివరకు ఒక్క నాయకుడైనా ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించాలనే ప్రయత్నం చేయలేదు అంతేకాదు ఆ ఆరోపణలను ఖండించే ధైర్యం కూడా ఎవరు చేయలేదు. ఇది సాధారణ విషయమే కావచ్చు కానీ లో లోపల ఉన్న విభేదాల తీవ్రతకు ఇది స్పష్టమైన సూచన.

ఎందుకంటే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిపై ఒక సాధారణ రైతు కార్యకర్త బహిరంగంగా ఆరోపణలు చేస్తుంటే ఆ ఆరోపణలకు సమాధానం చెప్పడానికి గాని సమస్యను పరిష్కరించడానికి గాని ఇప్పటివరకు ఒక్క నాయకుడైనా ముందుకు రాకపోవడం గమనార్హం. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో పార్టీ యంత్రాంగం వెంటనే స్పందించి ఆరోపణలు అసత్యం అంటూ కౌంటర్ ఇస్తుంది.లేదంటే మధ్యవర్తిత్వం చేసి వివాదాన్ని కూల్ గా మారుస్తుంది.

కానీ ఇక్కడ మాత్రం నిశ్శబ్దం.... పూర్తి నిశ్శబ్దం. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు అని చెప్పే డైలాగులు చెల్లాచెదురయ్యాయి. ప్రతిపక్షాలకు అసమ్మతి వాదులకు ఇది గోల్డెన్ ఛాన్స్.

మీకు మీరే కొట్టుకుంటుంటే మేమేం చేయాలి? అంటూ సెటైర్లు పేలుస్తున్నారు. వాట్సాప్ యూనివర్సిటీలో ఈ ఎపిసోడ్ ఇప్పటికే బ్లాక్ బస్టర్ ఎంటర్టైన్మెంట్ గా ట్రెండ్ అవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మేమే స్ట్రాంగ్ అన్న ధోరణితో ముందుకు నడిచే నాయకులకు ఇది షాక్ మాత్రమే కాదు– ఒక హెచ్చరిక. ప్రజల సమస్యల కంటే వ్యక్తిగత ఈగోలు ముందుకు వస్తే ఇలాంటి ఎపిసోడ్లు మరింత పెరిగే అవకాశం ఉంది.

గ్రామాల్లో ఇప్పుడు అభివృద్ధి సంక్షేమ లాంటి మాటలు సైలెంట్ అయ్యాయి. వాటి స్థానంలో ఎవరు ఎవరిని ఎక్కడ ఎప్పుడు ఎలా బట్టబయలు చేశారు? అనే డిబేట్ నడుస్తోంది.

కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళుతుంది అంటూ ఇదంతా గమనిస్తున్న ప్రజలు అడుగుతున్నారు.

## యుద్ధాలు, బాంబుల దాడుల నియంత్రణకు అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాలి

**● ఐక్యరాజ్య సమితి తక్షణమే చర్యలు తీసుకోవాలి. సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**


**కరీంనగర్ టౌన్, మార్చ్23, (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ వ్యాప్తంగా ఒక దేశంపై మరొక దేశం యుద్ధాలు, దాడులు చేయకుండా జరగాలంటే అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాలని,తక్షణమే ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకోవాలని అదే స్థాయిలో భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకోవాలని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హితవు పలికారు. సోమవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ జిల్లా కార్యవర్గ,కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య అధ్యక్షతన జరిగిందని జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు.ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు జరుపుతున్న బాంబుల దాడుల రోజు రోజుకు తీవ్రతరం అవుతున్నాయని,దాని వల్ల అంతర్జాతీయ స్థాయిలో చమురు,గ్యాస్ కొరత ఏర్పడుతుందని,వంట గ్యాస్ ను బ్లాక్ మార్కెట్ కు తరలించి కొరత సృష్టించి ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం పడుతుందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ల కొరత లేకుండా చేయాలని,ప్రధాని నరేంద్ర మోడీ కూడా బాంబుల దాడుల నియంత్రణకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో సంప్రదింపులు చరపాలని వెంకటరెడ్డి హితవు పలికారు. పార్లమెంటు సమావేశాల్లో అత్యధిక రోజులు పాల్గొన్నానని గొప్పలు చెప్పుకునే ప్రధాని మోడీ దేశ ప్రజల ప్రయోజనాల గురించి ఏం చేశాడో చెప్పాలని, దేశంలో నిరుద్యోగం రూపుమాపలేదని, నల్లధనం వెలికి తీయలేదని, బీజేపీ ప్రభుత్వ హయంలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం అయ్యాయని, కార్పోరేట్ సంస్థలు బాగుపడ్డాయని, ఆదానీ, అంబానీల ఆస్తులు పెరిగాయని పేదల బ్రతులు మారలేదని ఆరోపించారు. దేశంలో ఐదు రాష్ట్రాలలో ఉన్న ఎన్నికలను దృష్టిలో బీజేపీ ప్రభుత్వం నిత్యవసర ముడిసరుకుల మీద దృష్టి పెట్టలేదని లేదంటే ఇప్పటికే దేశ ప్రజలపై భారీగా భారం మోపేదనీ వెంకటరెడ్డి ఆరోపించారు.సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుని భారత దేశ రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న సందర్భంగా ప్రజలకు మరింత చేరువ కావడం కోసం ఏప్రిల్ నెలలో ఇంటింటికి సిపిఐ అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్ళే కార్యక్రమానికి శ్రీకారం చుట్టమని రాష్ట్ర వ్యాప్తంగా ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సీపీఐ నీ బలోపేతం చేయడం కోసం పార్టీ సభ్యత్వాన్ని పెంచుకోవాలని, ప్రజా సంఘాలను అన్ని గ్రామాల్లో, మండలాల్లో విస్తరించి మహాసభలు జరుపుకోవాలని శ్రీనివాస్ సూచించారు. ఈ సమావేశములలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య న్యాలపట్ల రాజుతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.





# సమాజంలో సమానత్వాన్ని పెంచేది విద్య

**● విద్యా భారతి పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి రూ.20 లక్షల విరాళం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**సంగారెడ్డి (పటాన్చెరు),మార్చ్ 23(ది క్రైం న్యూస్):** విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనమని, సమాజ అభివృద్ధి మరియు వ్యక్తిగత ఎదుగుదలలో అది కీలకపాత్ర పోషిస్తుందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో గల విద్యా భారతి పాఠశాలలో రూ. 20 లక్షల సొంత నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను సోమవారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, జాతీయ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధిని పెంపొంది ంచడంలో విద్యా భారతి సంస్థల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా విధానంలో కూడా సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించిన ఎమ్మెల్యేను సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా భారతి సంస్థ దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, భారతీ విద్యా సమితి అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శి రవి, టప్ప కుమార్, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు భయపడేది లేదు: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి



**కరీంనగర్ టౌన్, మార్చ్23(ది క్రైమ్ న్యూస్):** ప్రజలకోసం పోరాడే బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తే భయపడేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. అమలుగాని 420 హామీలు, 6 గ్యారంటీల ను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావ్ చలో అసెంబ్లీ కి పిలుపునిచ్చిన క్రమంలో సోమవారం ఉదయమే తిమ్మాపూర్ బీజేపీ నాయకులను, కార్యకర్తలను ఎల్ఎండి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేసినంత మాత్రాన ప్రజల కోసం ఎంతటికైనా సిద్ధమేనని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,మాజీ ఎంపీటీసి ఎడ్ల జోగిరెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల.తిరుపతి రెడ్డి, బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధికారప్రతినిధి రాజు గౌడ్,జంగ సునీల్ రెడ్డి, వేల్పుల ఓదయ్య, రేగూరి సుగుణాకర్, దూల్గుంటి శేఖర్ రెడ్డి, కిన్నెర ముత్తిలింగం, యాదగిరి తదితరులను ఎల్ఎండి ఇంచార్జి ఎస్ఐ అన్వర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ తిలక్ ముందస్తుగా అదుపులోకి తీసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

## భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం

**- యు వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు అక్కల బాపు యాదవ్**



**భూపాలపల్లి/కాటారం/మార్చి- 23: (ది క్రైమ్ న్యూస్):** యువతకు స్ఫూర్తి ప్రదాత, విప్లవ వీరుడు భగత్ సింగ్ ఆశయాలు నేటికీ సజీవంగా ఉన్నాయని, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య హక్కుల కోసం యువత ముందుకు రావాలని యు వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు అక్కల బాపు యాదవ్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతు భగత్ సింగ్ చూపిన మార్గంలో నడుస్తూ, అణచివేతకు వ్యతిరేకంగా, అన్యాయానికి ఎదురు నిలుస్తూ, దేశ యువతను చైతన్యపరిచే ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు సాలినేని రాజమణి, నాయకులు పంచిక మల్లేష్ యాదవ్, బోయిని రాజయ్య, శ్రీనివాస్ రెడ్డి, సుగుణ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారీగా సిపిఎం పార్టీ నుంచి సిపిఐ లిబరేషన్ పార్టీలోకి చేరిక

**- సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా**



**భూపాలపల్లి: మార్చి -23: (ది క్రైమ్ న్యూస్):** సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీని బలోపేతం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం పార్టీ నుంచి సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ లో 10 కుటుంబాలు శ్రీకాంత్, బంధు క్రాంతి, బుర్ర స్వాతి, బంధు సుజాత, కిష్టయ్య, వెంకటేష్, కుమార్ తదితరులు చేరారు. వారికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేష్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చారిత్రక నేపథ్యం ఉన్న భూపాలపల్లి గడ్డపై సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ విస్తరింపజేయాలని, విప్లవోద్యమ వారసత్వాన్ని నిలబెట్టాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా లిబరేషన్ విస్తరిస్తుందని పార్లమెంట్ లోను ప్రజాక్షేత్రంలోనూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలను నిర్వహిస్తుందని అన్నారు. దేశంలో ఫాసిస్టు శక్తుల ప్రమాదం పెరిగిపోయిందని, ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఎస్ ఐ ఆర్ పేరుతో ప్రజల ఓటు హక్కును హరిస్తుందని, ప్రజలపై తీవ్రమైన దాడిని కొనసాగిస్తుందని తెలిపారు. ప్రస్తుతం జరగనున్న కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పోటీ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ గా ఉందని రేవంత్ రెడ్డి సర్కార్ అంకెల గారడీ చేసిందని విమర్శించారు.

## శ్రీదుర్గను మూయించి జనాల దుర్గతిని పోగొట్టండి





**తిమ్మాపూర్, మార్చి23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం వచ్చునూరు శివారులోని శ్రీదుర్గ గ్రానైట్ క్వారీని మూయించాలని కోరుతూ గ్రామానికి చెందిన ఉప్పులేటి రాజు అనే యువకుడు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీదుర్గా గ్రానైట్ పేరుతో క్వారీ నిర్వాహకులు గతకొంత కాలంగా చేస్తున్న అక్రమ మైనింగ్ తో గ్రామం నుండి జూగుండ్ల వెళ్ళే దారి అధ్వానంగా తయారై అంబులెన్స్ వెళ్ళలేని పరిస్థితి నెలకొంటే,ఓవర్ లోడ్ బండ లారీలతో రోడ్డు కిందున్న పైపులైన్ పగిలి రాకపోకలకు గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. క్వారీ బ్లాస్టింగ్లతో గ్రామంలోని ఇండ్లు,దారులు వైబ్రేషన్ కు గురై పగుళ్లు ఏర్పడ్డాయని,భారీ శద్దాల మూలంగా పశుపక్ష్యాదులు అంతరించగా, క్వారీ నుండి వచ్చే దుమ్ము,ధూళితో గ్రామస్తులకు శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయన్నారు.ఇటీవల బండలారీల వేగంతో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారినపడి క్షతగాత్రులుగా మారిన పరిస్థితితో గ్రామస్తులు భయాందోళనలకు గురౌతున్నారని ఆవేదన చెందాడు.నిభందనలకు విరుద్ధంగా పరిమితికి మించిన లోతులో బండను తీస్తుండగా సమీప బావుల్లో నీటిఊట తగ్గిందని,ఈ విషయాన్ని క్వారీ యజమానులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.క్వారీని ఆనుకుని ఉన్న నాగుల చెరువును సైతం బండరాళ్లతో నింపి ఆక్రమించి సహజ సంపదను కొల్లగొడుతున్నారని, చట్టాలను బేఖాతరు చేసి లేబర్ కార్డులు లేకుండా కార్మికులతో పనులు చేయిస్తున్న క్వారీపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైన సంభందిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్తుల దుర్గతిని పోగెట్టేందుకు తక్షణమే విచారణ జరిపించి శ్రీదుర్గా గ్రానైట్ మాఫియాపై చర్యలు తీసుకుని క్వారీని మూయించాల్సిందిగా కలెక్టర్ ను కోరుతున్నట్లు ఉప్పులేటి రాజు వినతి పత్రంలో పేర్కొన్నారు.

# ప్రజల అవసరాలే ధ్యేయంగా అభివృద్ధి పనులు

## ● మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ● సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



**సంగారెడ్డి(గుమ్మడిదల), మార్చ్ 23(ది క్రైమ్ న్యూస్):** సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సీఆర్ఆర్ గ్రాంట్ 2023-24 కింద సుమారు రూ. 25 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు 15వ వార్డు కౌన్సిలర్ పొన్నాల ప్రమీల ఆధ్వర్యంలో చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ దశరథ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ, నాణ్యమైన పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కౌన్సిలర్ పొన్నాల ప్రమీల మాట్లాడుతూ వార్డులోని సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అభి శెట్టి రాజశేఖర్, గోకర్ నిర్మల, మేడిపల్లి మురళి, బెంబడి సంజీవరెడ్డి, మూడు చింతల నరేందర్ రెడ్డి, కత్తుల రమేష్, సద్ది జైపాల్ రెడ్డి, సురభి కుమార్ గౌడ్, నర్సంపల్లి రాజిరెడ్డి, బ్యాగరి లక్ష్మీ, గిద్దె విజయ లక్ష్మి, శ్రీచూర్ణం చక్రపాణి, వివిధ పార్టీల నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, పుట్ట నర్సింగ్ రావు, సారెడ్డి గారి వెంకట్రాంరెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, తుపాకుల రాజు, షేక్ హుస్సేన్, మంద భాస్కర్ రెడ్డి, చప్పటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య అమరవీరులకు నివాళులర్పించిన బిజేపి నాయకులు



**తిమ్మాపూర్, మార్చి23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలో ముగ్గురు స్వాతంత్ర్య అమరవీరులకు సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ.... దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడుతూ పట్టుబడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లను మార్చి23 న ఒకేసారి ఉరితీసిన రోజని పేర్కొన్నారు. భారత ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం వారి త్యాగాలను ప్రజలకు తెలిసేలా షహీద్ దివస్ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తుందని, వారి దేశభక్తి, త్యాగాలను విస్మరించకుండా వారి ఆశయ సాధనలో యువత నడుంబిగించాలని సుగుర్తి కోరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసి ఎడ్ల జోగిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,మండల ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి, బిజెవైఎం మండలాధ్యక్షుడు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఓబీసి జిల్లా అధికార ప్రతినిధి రాజు గౌడ్, మండల కార్యదర్శి జంగ సునీల్ రెడ్డి, రేగూరి సుగుణాకర్, వేల్పుల ఒదయ్య, కిన్నెర ముత్తిలింగం, గొల్లపల్లి యాదగిరి, దూల్గుంటి శేఖర్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లలో ఆలస్యం చేస్తే సహించేది లేదు

## ● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, మార్చి - 23:(ది క్రైమ్ న్యూస్):** కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1వ తేది వరకు జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయరాదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల పనులపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, పీఆర్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు సంబంధించిన అన్ని పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల నిర్వహించిన సమావేశంలో అధికారులే ఎప్పటి వరకు పనులు పూర్తి చేస్తారో డెడ్‌లైన్ ఇచ్చారని, అట్టి డెడ్ లైన్ ప్రకారం జాప్యం లేకుండా కచ్చితంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా మహాదేవపూర్ వద్ద ఆర్చ్ నిర్మాణ పనులు పురోగతిపై దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఇచ్చిన సమాధానంపై ఏప్రిల్ 30వ తేదీ లోపు పూర్తి చేయాలని, ఏం చేస్తారో నాకు సంబంధం లేదు, ఇచ్చిన టైమ్‌లైన్ ప్రకారం పనులు పూర్తి కావాలని ఆయన స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని గుర్తించిన పార్కింగ్ స్థలాలలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం డిఎస్పీ సూర్య నారాయణ, వైద్య, ఇరిగేషన్, దేవాదాయ, విద్యుత్తు, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూరులో బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్...!



**మానకొండూర్, మార్చి23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా బిజెపి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్ రెడ్డి, మండలాధ్యక్షుడు కంది రాజిరెడ్డి మాట్లాడుతూ....అవినీతి, అరాచక, కమిషన్ల పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడికి వెళ్లనివ్వకుండా అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలని లేదంటే బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు రాపాక ప్రవీణ్, అప్పని తిరుపతి, మియాపురం లక్ష్మణాచారి, శీలం కుమార్ యాదవ్,సురేష్ కుమార్, వరప్రసాద్,రాపాక అశోక్, ప్రదీప్, సంపత్ పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఉన్నారు.ద

# బాదం పప్పు నానబెట్టి తింటే మంచిదా? లేదంటే పచ్చిగా తింటే మంచిదా?

చాలా మందికి రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పు తినడం అలవాటు. అయితే బాదంపప్పు నానబెట్టి తింటే మంచిదా.. లేదంటే అలాగే పచ్చిగా తింటే మంచిదా అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. బాదంపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ మీరు సరైన పద్ధతిలో తింటేనే ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి బాదంపప్పును పచ్చిగా తినాలా? నానబెట్టి ఎలా తినాలా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బాదంలో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా బాదంలో కాల్షియం, ఫాస్ఫరస్ కూడా ఉన్నాయి. ఇవి శరీరానికి పోషకాలను అందిస్తాయి. బాదం పప్పును ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసంరాత్రి పడుకునే ముందు కొన్ని బాదంపప్పులను నీళ్లతో వేసి నానబెట్టాలి. తర్వాతవాటిని తొక్క తీసి ఉదయం పూటా ఖాళీ కడుపుతో తినాలి. అలాగే బాదంపప్పును స్నాక్‌గా కూడా తినవచ్చు. పచ్చి వాటి కంటే నానబెట్టిన బాదం శరీరానికి ఎక్కువ మేలు చేస్తుంది. అలాగే బాదం షేక్ చేసి కూడా తాగొచ్చు. కానీ బాదంలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు పెరగడానికి దారితీయవచ్చు. అందుకే వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.నట్‌ఎలర్జీ ఉన్నవారు వాటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు. ఎలర్జీ ఉన్న వారు వీటికి దూరంగా ఉండటం బెటర్.

# 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

## - దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్



**భూపాలపల్లి, మార్చి -23:(ది క్రైమ్ న్యూస్):** 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలు విజయవంతంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జరగేలా సమగ్ర చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. సోమవారం గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్ నుండి దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు చేసేందుకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తు ప్రణాళికలతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ముఖ్యంగా ఘాట్‌ల అభివృద్ధి, రహదారి సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్నాన ఘాట్‌ల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని, జనసమ్మర్థ నియంత్రణ కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా తాత్కాలిక వసతి గృహాలు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని ఏర్పాట్ల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పుష్కరాలను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. ప్రతిపాదనలు మేరకు ప్రాధాన్యత పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు నిర్వహణకు ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, దేవాదాయ తదితర శాఖల ద్వారా చేపట్టనున్న పనులను వివరించారు. ఘాట్లు, మౌలిక సదుపాయాలు, రోడ్ల అభివృద్ధి, నూతన రోడ్ల నిర్మాణం వంటి చేపట్టనున్న పనులకు ఆయా శాఖల ద్వారా ప్రతిపాదనలు. పంపినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి మేలు చేసే సోంపు షర్బత్..

## శరీర ఉష్ణోగ్రతను ఐసులా కరిగించే సూపర్ డ్రింక్ మీ కోసం..





ఎండ వేడిమి రోజురోజుకూ పెరుగుతోంది. ఏసీలు, కూలర్లు, శీతల పానీయాల వినియోగం పెరిగింది. ఐస్‌క్రీమ్‌ల నుండి స్మూతీస్ వరకు, లస్సీ నుండి ఇంట్లో తయారుచేసిన నిమ్మరసం, మజ్జిగ వరకు అందరూ ఆరోగ్యకరమైన, శరీరానికి చలువ చేసే ఆహారాన్ని కోరుకుంటున్నారు.. బాటిల్, రిఫ్రిజిరేటెడ్ పానీయాలు కెమికల్ ఆధారంగా తయారు చేస్తారు. కాబట్టి అవి వాటి ప్రత్యేక రుచిని కలిగి ఉంటాయి. కానీ, ఇంట్లో తయారుచేసిన జ్యూస్‌లు మరింత రుచిని కలిగి ఉంటాయి. అలాంటిదే వేసవిలో మనకు చలువు చేసే ఒక పానీయం ఉంది. ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోగల ఈ షర్బత్ ఎండవేడిమి, మంటను తగ్గించి మిమ్మల్నీ కూల్‌గా ఉంచుతుంది. అదేంటో ఇక్కడ తెలుసుకుందాం. సాధారణంగా మనమందరం సోంపును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తాము. చాలా మంది దీనిని వివిధ డెజర్ట్‌లకు కూడా కలుపుతారు. సోంపు షర్బత్ అనేది ప్రజలందరికీ ఎంతగానో నచ్చే చల్లని జ్యూస్. ఇది సాధారణంగా పసుపు రంగులో ఉంటుంది. దాని ప్రత్యేకమైన రుచి, వాసనకు పేరుగాంచింది. ఇది వేసవిలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం కూడా ఉండదు. ఇది శరీరంలోని వేడి నుండి ఉపశమనాన్ని అందజేయడమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. సోంపు షర్బత్‌ను తయారు చేయడానికి ప్రధాన పదార్థాలు సోంపు గింజలు, నిమ్మకాయ రసం, చక్కెర, నీరు. ఇకపోతే, ముందుగా ఈ సోంపు ఆరోగ్య ప్రయోజనాలను పరిశీలించినట్టయితే.. 1. జీర్ణక్రియలో.. ఇది జీర్ణక్రియను ప్రోత్సహించడానికి వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి సహాయపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడే లక్షణాలను కలిగి ఉన్నాయి. ఇవి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఇవి మంచి జీర్ణక్రియకు సహాయపడతాయి. అందుకే మనం ఎప్పుడు హోటల్ కి డిన్నర్ కి వెళితే భోజనం అయ్యాక సోంపు అందిస్తారు. 2 . ఫ్రెషెన్స్ బ్రీత్ .. యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. దీని కారణంగా సోంపు నమలడం వల్ల శ్వాసను తాజాగా ఉంచుతుంది. ఇది లాలాజల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఇది నోటిలోని బ్యాక్టీరియాను తొలగించేందుకు సహాయపడుతుంది. 3. మలబద్ధకం కోసం ప్రయోజనకరమైన.. సోంపు తేలికపాటి భేదిమందు లక్షణాలను కలిగి ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది ప్రేగు కదలికను ప్రేరేపిస్తుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందించడంలో సహాయ పడుతుంది. 4. కడుపులో మంటను తగ్గిస్తుంది.. కడుపులో గ్యాస్‌ను తొలగించడంలో సహాయపడే కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటుంది. జీర్ణాశయంలోని కండరాలను సడలించడం, గ్యాస్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఉబ్బరం, కడుపులో అసౌకర్యాన్ని తగ్గించడంలో సోంపు బాగా సహాయపడుతుంది. 5. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు.. సోంపు శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్తం చేయడంలో సహాయపడే ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్స్ వంటి యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇది మంటను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. మీరు క్రమం తప్పకుండా సోంపును తీసుకుంటే అది మీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. సోంపుతో షర్బత్ తయారీకి కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.. 2 టేబుల్ స్పూన్లు సోంపు 1/2 కప్పు చక్కెర మీరు కావాలంటే చక్కెరకు బదులుగా తేనెను కూడా ఉపయోగించవచ్చు. 1 నిమ్మకాయ రసం 1 లీటరు నీరు తాజా పుదీనా ఆకులు మరింత రుచి కోసం, రోజ్ వాటర్ ను కొద్దిగా కలుపుకోవచ్చు. సోంపు షర్బత్ ఆరోగ్య ప్రయోజనాలు: సోంపు షర్బత్ జీవక్రియను పెంచి, కొవ్వు కరుగుటకు సహాయపడుతుంది. శరీర ఉష్ణోగ్రతను చల్లబరుస్తుంది. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరిగి, డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. సోంపు షర్బత్ చల్లగా ఉండటం వల్ల శరీరాన్ని చల్లబరుస్తుంది. డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. తిన్న తర్వాత తీసుకుంటే, నోటి దుర్వాసనను తొలగిస్తుంది. సోంపు గింజల్లో యాంటి బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇవి నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధించి, నోటి దుర్వాసనను తొలగిస్తాయి. సోంపు షర్బత్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఏదైనా సరే మోతాదుకు మించి తీసుకోవటం మంచిది కాదు.

# ఈ ఐదుగురు మెంతులకు దూరంగా ఉండాలి.. లేకుంటే ప్రమాదమే..!



అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి, అద్భుతమైన ప్రయోజనాలను పొందడానికి మెంతి గింజలను తీసుకుంటారు. మెంతి గింజల వల్ల కలిగే ప్రయోజనాల గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. అయితే ఆహారం రుచిని పెంచేందుకు ఈ గింజలను రకరకాలుగా ఉపయోగిస్తాం. మెంతి గింజలను సాధారణంగా ఔషధంగా లేదా ఆహారంతో తీసుకుంటారు. ఇవి చాలా ఆరోగ్యకరమైనవి. కానీ కొంతమంది మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కోవచ్చు. మీ శరీరంలో కింద పేర్కొన్న కొన్ని సమస్యలు ఉంటే, మీరు మెంతులు తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మెంతులను ఎవరు తీసుకోకూడదు దయాబెటిస్: మెంతి గింజలు చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో దీని వినియోగం మధుమేహాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. మధుమేహ రోగులు మెంతి గింజలను తీసుకునే ముందు వారి వైద్యుడిని సంప్రదించాలి. అలర్జీ: కొందరికి మెంతి గింజల వల్ల అలర్జీ రావచ్చు. అందువల్ల మీరు మెంతులు వైద్యపరమైన ప్రతిచర్య ఏదైనా సూచనను కలిగి ఉంటే, మీరు దానిని నివారించాలి. అల్సర్: మెంతుల వినియోగం అల్సర్ రోగులకు హానికరం. ఈ రోగులు మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కొంటారు. హార్మోన్ల అసమతుల్యత: కొన్ని సందర్భాల్లో మెంతి గింజల అధిక వినియోగం హార్మోన్ల స్థాయిలను భంగం చేస్తుంది. అందుకే హార్మోన్ల అసమతుల్యత లక్షణాలు ఉన్న వ్యక్తులు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. శరీర ఉష్ణోగ్రత అసమతుల్యత: కొంతమందికి మెంతులను తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలో అసమతుల్యత ఏర్పడవచ్చు. ఇది శారీరక సమస్యలను కలిగిస్తుంది. ఈ సమస్యలన్నీ ప్రతి వ్యక్తికి రావని గమనించండి. అయితే మీకు ఈ సమస్యలు ఏవైనా ఉంటే మీరు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

# స్పోర్ట్స్

# న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన సౌతాఫ్రికా..

## ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం

వెల్లింగ్టన్ వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 19 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఆఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 164 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో 145 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా బ్యాటర్ కానర్ ఎస్టర్‌హ్యూజెన్ 36 బంతుల్లో 57 పరుగులతో మెరుపు హాఫ్ సెంచరీ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కివీస్ ఓపెనర్ టిమ్ రాబిన్సన్ 32 పరుగులతో శుభారంభం ఇచ్చినప్పటికీ, మిడిల్ ఆర్డర్ విఫలం కావడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. ఈ విజయంతో సౌతాఫ్రికా ఆటగాళ్లలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా స్పిన్నర్లు కేశవ్ మహారాజ్, ప్రినిలన్ సుబ్రాయన్ అద్భుతంగా బౌలింగ్ చేసి న్యూజిలాండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. అరంగేట్రం చేసిన సుబ్రాయన్ 13 పరుగులకే 2 వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించాడు. అలాగే కెప్టెన్ కేశవ్ మహారాజ్ 22 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి తన అనుభవాన్ని చాటుకున్నాడు. ఫాస్ట్ బౌలర్ గెరాల్డ్ కోయెట్జీ 3 వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ తీశాడు. న్యూజిలాండ్ ఒకానొక సమయంలో 8.2 ఓవర్లలో 76/2 స్కోరుతో పటిష్టంగా కనిపించినా, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. న్యూజిలాండ్ జట్టులో టామ్ లాథమ్, మిచెల్ సాంట్నర్ వంటి సీనియర్ ఆటగాళ్లు లేకపోవడం ఆ జట్టుపై స్పష్టంగా కనిపించింది.



ఐపీఎల్ 2026 కోసం కొంతమంది ఆటగాళ్లు భారత్‌కు బయలుదేరడం వల్ల కివీస్ తన రెండో శ్రేణి జట్టుతో బరిలోకి దిగింది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ సొంతం చేసుకోవాలని భావించిన కివీస్‌కు సౌతాఫ్రికా గట్టి షాక్ ఇచ్చింది. సిరీస్ విజేతను నిర్ణయించే ఐదో మరియు చివరి టీ20 మ్యాచ్ బుధవారం క్రైస్ట్‌చర్చ్‌లో జరగనుంది. ఈ పోరులో ఎవరు గెలిస్తే వారే సిరీస్ విజేతగా నిలుస్తారు.

## ప్రాక్టీస్ మ్యాచ్‌లో దుమ్మురేపిన కోహ్లీ

ఐపీఎల్ 2026 సీజన్ కోసం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సిద్ధమవుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సన్నదమవుతోంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ప్రాక్టీస్ క్యాంప్‌లో ముమ్మరంగా సాధన చేస్తోంది. మరో 5 రోజుల్లో ఈ క్యాష్ రిచ్ లీగ్ తెరలేవనుండటంతో అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోంటుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. జట్టులోని ఆటగాళ్లంతా రెండు జట్లుగా విడిపోయారు. ఒక జట్టుకు కృనాల్ పాండ్యా సారథ్యం వహించగా.. మరో జట్టును వెకంటేష్ అయ్యర్ నడిపించాడు. ఈ సన్నాహక మ్యాచ్‌లో జితేశ్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చెలరేగాడు. 37 బంతుల్లోనే 81 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గత సీజన్ తరహాలోనే ఈ సీజన్‌లోనూ ఆర్‌సీబీ ఫినిషర్‌గా సత్తా చాటేందుకు రెడీ అయ్యాడు. అతని తర్వాత ఆస్ట్రేలియా ఆటగాడు టీమ్ డేవిడ్ 14 బంతుల్లో 36 పరుగులు చేశాడు. రూ.7 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వెంకటేష్ అయ్యర్ 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు.ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 12 బంతుల్లో 3 సిక్సలతో 29 పరుగులు చేశాడు. తక్కువ పరుగులే చేసినా.. దూకుడుగా ఆడాడు. వెంకటేశ్ అయ్యర్‌ను మిడిలార్డర్‌లో ఆడించాలనే యోచనలో ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌కు సంబంధించిన ఒక వీడియోను ఆర్‌సీబీ ఫ్రాంచైజీ సోమవారం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ వీడియోలో కృనాల్ పాండ్యా మాట్లాడుతూ.. 'ఇది ఒక గొప్ప ప్రాక్టీస్ మ్యాచ్. భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, మంగేష్ యాదవ్ బౌలింగ్‌లో బాగా రాణించాడు. జితేష్ శర్మ, టీమ్ డేవిడ్, వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు'అని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ తమ తొలి టైటిల్‌ను అందుకున్న విషయం తెలిసిందే. ఈ జోరును తాజా సీజన్‌లోనూ కొనసాగించి టైటిల్ నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లోనే ఆర్‌సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఫస్టాఫ్ షెడ్యూల్‌లో ఆర్‌సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. గౌహతిలో రాజస్థాన్ రాయల్స్, ముంబైలో ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.



# ఐపీఎల్ జట్లకు సవాలు విసురుతోన్న ఢిల్లీ

అద్భుతమైన ఆటగాళ్లతో జట్టును కూడగట్టుకుని సత్తాచాటేందుకు సమాయాత్తమైంది ఢిల్లీ క్యాపిటల్స్. ఈ సీజన్లో ఐపీఎల్ జట్లకు ఢిల్లీ సవాలు విసురుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో ఆటగాళ్ల సత్తా ఏంటి? ఎవరు ఎలాంటి ప్రభావం చూపబోతున్నారనేది ఆసక్తికరమైన అంశంగా మారింది. ఐపీఎల్ లో ఢిల్లీ క్యాపిటల్స్ సమరానికి సన్నద్ధమైంది. సమర్థవంతమైన ఆటగాళ్లతో సరికొత్తగా మారిపోయింది. ఇండియన్ క్రికెటర్ లోకేశ్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్ సారథిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏరికోరి ఎంచుకున్న ఆటగాళ్లతో జట్టును సిద్ధంచేశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ లో చురుగ్గా వ్యవహరించే ఆటగాళ్లతో ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సీజన్లో అదరగొట్ట బోతున్నారు. ఇప్పటిదాకా సాధ్యం కాని ట్రోఫీని చేజిక్కించుకోవాలని లోకేశ్ రాహుల్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ఐపీఎల్ సీజన్లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్రత్యర్థి జట్లను బెంబేలెత్తించబోతోంది. ఐపీఎల్ మ్యాచుల్లో భారీ స్కోర్లను సాధించి... సాధికార విజయాలతో ట్రోఫీ చేజిక్కించుకోవాలని లోకేశ్ రాహుల్ జట్టును సిద్ధం చేశారు. ప్రతి జట్టును అంచనా వేసి.. బౌలింగ్ దళంతో బోల్తా కొట్టించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఐపీఎల్ మ్యాచులు జరిగే వేదికల్లో ఫీల్డింగ్ విషయంలో ఎక్కడా ఏమరుపాటు లేకుండా... ప్రత్యర్థి జట్లను తక్కువ పరుగులకే పరిమితం చేయాలని బౌలింగ్ దళం కసరత్తు చేస్తోంది. గడిచిన సీజన్లు వేరు... ఈ సీజన్ మనదే అనే సంకల్పంతో ఢిల్లీ క్యాపిటల్స్ పోరుకు సన్నద్ధమైంది. ఒక్కో ఆటగాడిది.. ఒక్కో నేపథ్యం. క్రీజులోకి రాగానే ఆవేశంతో ఆడకుండా... నింపాదిగా పరుగులు సాధించే లోకేశ్ రాహుల్ సారథ్యంలో... బ్యాటును ఝుళిపించే బ్యాట్స్ మెన్లు కరుణ్ నాయర్, డేవిడ్ మిల్లర్, బెన్ డకెట్, పాతుం నిషంక, పృథ్విషా, అభిషేక్ పోరెల్, త్రిష్టన్ స్టబ్స్ పరుగుల వరద పారించేందుకు సన్నద్ధమయ్యారు. ఆటను మలుపు తిప్పగలిగే ఆల్ రౌండర్లు  అక్షర్ పటేల్, సమీర్ రిజ్వీ, ఆశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, త్రిపురాణ అజయ్, నితిష్ రాణా, మాదవ్ తివారీ, అజయ్ మండల్ క్రికెట్ మైదానాల్లో ఆటతీరును ప్రదర్శించబోతున్నారు. ఐపీఎల్ సీజన్లలో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు మాయాజాల బంతులను సంధించేందుకు కసరత్తు పూర్తి చేశారు.  దిగ్గజ బ్యాట్స్ మెన్లను బంతులతో బోల్తా కొట్టించే మిచెల్ స్టార్క్, ప్రత్యర్థి జట్ల దూకుడుకు కళ్లెం వేసే నటరాజన్, హార్డ్ హిట్టర్లను ఆటకట్టించే కుల్దీప్ యాదవ్, దూకుడుతో చెలరేగే బ్యాట్స్ మెన్లను బంతులతో కట్టడిచేసే కైల్ జేమీసన్, పరిమిత పరుగులు ఇచ్చే దుష్మంత్ చమీరా, వికెట్లను పడగొట్టడమే లక్ష్యంగా బంతులు వేసే ముఖేశ్ కుమార్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కీలక పాత్ర పోషించబోతున్నారు. గత సీజన్ లో మెరుపు ఇన్నింగ్స్ లతో ప్రత్యర్థి జట్లకు షాకిచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్... ఈ సీజన్లో వరుస విజయాలే లక్ష్యంగా ఆడాలని లోకేశ్ రాహుల్ జట్టును సిద్ధం చేశారు. లీగ్ దశలో మెరుగైన ప్రదర్శనతో భారీస్కోర్లు నమోదు చేసి, ప్రత్యర్థి జట్లపై ఒత్తిడి తీసుకురావడంతోనే విజయం సాధ్యమవుతుందని లోకేశ్ రాహుల్ భావిస్తున్నారు. ఐపీఎల్ జట్లను   ప్రతిమ్యాచ్ లోనూ కట్టడి చేస్తేనే అత్యుత్తమ జట్టుగా ఢిల్లీ క్యాపిటల్స్ ను నిలబెట్టేందుకు ఆటగాళ్లందరూ సహకరించాలని కెప్టెన్ లోకేశ్ కోరారు. ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ నుంచి టెయిల్ ఎండర్ దాకా బ్యాటింగ్ విన్యాసాలతో దడపుట్టించే విధంగా ఆటతీరు కొనసాగించబోతున్నారు. లక్ష్యం ఒక్కటే... ఆటలో గెలుపు ఓటములు సహజం... ఓడినా... మెరుగైన ప్రదర్శనతో అభిమానుల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఇన్నింగ్స్ సాగాలనే విధానంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు సంసిద్ధం కావాలని లోకేశ్ రాహుల్ భావిస్తున్నారు.





## సత్తా చాటేందుకు గుజరాత్ టైటాన్స్ రెడీ..

ఆలస్యంగా వచ్చినా... అదరగొట్టింది. గుజరాత్ టైటాన్స్ ఇండియన్ ప్రీయర్ లీగ్ లో ఓ సంచలనంగా నిలిచింది. ఆరంభ సీజన్లో అడుగుపెట్టిన జట్లకు సాధ్యం కాని ఐపీఎల్ ట్రోఫీ.. మధ్యలో వచ్చిన గుజరాత్ సాధికార విజయాలతో చేజిక్కించుకుంది. నాలుగేళ్ల క్రితం గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ లో అడుగుపెట్టింది. అద్భుత ప్రదర్శనతో అగ్రస్థానంలో నిలిచి.. ఛాంపియన్లకే షాకిచ్చింది. 2022 సీజన్లో ఛాంపియన్ గా నిలిచింది. ఈ సీజన్ లో గుజరాత్ టైటాన్స్ పెర్ఫార్మెన్స్ ఎలా ఉండబోతుందనేది ఆసక్తి నెలకొంది.  ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో గుజరాత్ అడుపెట్టడమే అరుదైన సందర్భం. కాలుమోపిన తొలి సీజన్... లోనే గుజరాత్ టైటాన్స్... ఐపీఎల్ లో వరుస విజయాలతో దూసుకుపోయింది. 2008లో ఆరంభమైన ఐపీఎల్ సీజన్ లో అడుగుపెట్టిన పంజాబ్ కింగ్స్, ఢిల్లీ జట్లు ఇప్పటికీ ఐపీఎల్ ట్రోఫీని సాధించడం కలగా మారింది. ఆరంగేట్రం చేసిన తొలి యేడాదే గుజరాత్ టైటాన్స్ మాత్రం 2022లో  తొలి సారిగా  ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. గుజరాత్ టైటాన్స్ కు ఆరంభ సీజన్లో టీమిండియా ప్లేయర్ హార్ధిక్ పాండ్యా కెప్టెన్ గా వ్యవహరించి జట్టును ముందుకు నడిపించాడు. జట్టు సభ్యులను సమన్వయం చేసుకుని అన్ని మ్యాచుల్లో అద్భుతంగా ఆడి సత్తాచాటారు. రెండేళ్లు గడిచిన తర్వాత మూడో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుకు కెప్టెన్ హార్దిక్ పాండ్య దూరమయ్యాడు. దీంతో ఇబ్బంది గుజరాత్ టైటాన్స్... పెద్దగా ప్రదర్శన చేయలేకపోయింది. కేవలం అయిదు విజయాలతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే  మళ్లీ పుంజుకున్న గుజరాత్ టైటాన్స్ నాలుగో సీజన్లో వరుస విజయాలను సాధించింది. ప్లేఆఫ్స్ చేరుకుంది. ఇపుడు గుజరాత్ టైటాన్స్ సమర్థవంతమైన జట్టుగా మారింది. యువ క్రికెటర్ శుభ్ మన్ గిల్ కెప్టన్ గా వ్యవహరిస్తున్నాడు. అనుభవం కలిగిన ఆటగాళ్లు.. యువ క్రికెటర్లతో గుజరాత్ టైటాన్స్.... సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఈ సీజన్‌లో ప్రధాన జట్లలో గుజరాత్ టైటాన్స్ నిలిపి.. మరోసారి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకోవాలని గుజరాత్ టైటాన్స్ జట్టు ఎదురు చూస్తోంది. శుభ్ మన్ గిల్ సారథ్యంలో పాత సభ్యులతోనే జట్టు కొనసాగుతుండటం జట్టు బలంగా ఉంది. విదేశీ సీనియర్ ఆటగాళ్లు... ఇండియన్ యువ క్రీడాకారులతో సమన్వయం కుదిరింది. ఆటగాళ్ల మధ్య మంచి కెమిస్ట్రీ ఉండటాన్ని గుర్తించిన గుజరాత్ టైటాన్స్ ఫ్రాంఛైజీ వేలానికి ముందు ఆ జట్టు 20 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. కొత్త సీజన్ కోసం నిర్వహించిన వేలంలో కొత్తగా జేసన్ హోల్డర్, అశోక్ శర్మ, టామ్ బాంటన్, ల్యూక్ వుడ్, తెలుగబ్బాయి పృథ్వీరాజ్ యర్రాలను తీసుకుంది. ఈసారి తుది జట్టులో పెద్దగా  మార్పులు లేకుండానే బరిలో దిగబోతుంది.  గుజరాత్ టైటాన్స్ జట్టులో కెప్టన్  శుభ్‌మన్ గిల్, చురుకు దనంతో పరుగులు సాధించే సాయి సుదర్శన్, స్టైలిష్ షాట్లతో విరుచుకుపడే బట్లర్‌లతో  టాప్ ఆర్డర్ టైటాన్స్‌కు ప్రధాన బలం అనడంలో సందేహం లేదు. ఓపెనర్లు గిల్, సుదర్శన్... క్రీజులో కుదురుకుని నిలకడైన ఆటతీరుతో గుజరాత్‌కు వెన్నెముకగా ఉంటున్నారు. మంచి ఆరంభాలతో గుజరాత్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

## ఐపీఎల్ కోసం వెళ్తే కఠిన చర్యలు

### విదేశీ ఆటగాళ్లకు పీసీబీ ఛైర్మన్ వార్నింగ్

చివరి నిమిషంలో పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) నుంచి తప్పుకునే విదేశీ ఆటగాళ్లను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ హెచ్చరించాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం పీఎస్ఎల్ నుంచి తప్పుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాడు. వరుసగా రెండో ఏడాది కూడా పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్), ఐపీఎల్‌లు ఒకే సమయంలో జరగనున్నాయి. దాంతో చాలా మంది విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్‌ను వదిలేసి ఐపీఎల్ ఆడేందుకు మొగ్గు చూపుతున్నారు. జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరాబాని, శ్రీలంక స్టార్ ఆల్‌రౌండర్ దసన్ షనక, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరణ్ పీఎస్ఎల్‌ను వీడి ఐపీఎల్ ఆడేందుకు సిద్దమయ్యారు. చివరి నిమిషంలో ఈ ఆటగాళు పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీలతో తమ ఒప్పందాలను రద్దు చేసుకున్నారు. ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టుతో బ్లెస్సింగ్ ముజారాబానీ, లాహోర్ ఖలందర్స్ జట్టుతో దసన్ షనక తమ కాంట్రాక్టులను వదులుకున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన మోహ్‌సిన్ నఖ్వీ విదేశీ ఆటగాళ్లపై విమర్శలు గుప్పించాడు. 'మేం రూల్స్ ప్రకారం ఆటగాళ్లపై చర్యలు తీసుకుంటాం. గతేడాది పెషావర్ జల్మీకి ఆడిన కార్బిన్ బోష్.. ఆఖరి నిమిషంలో జట్టును వీడి ముంబై ఇండియన్స్‌లో చేరాడు. దాంతో పీఎస్ఎల్ ఆడకుండా అతనిపై ఏడాది పాటు నిషేధం విధించారు. ఈ సారి కూడా అదే విధమైన కఠిన చర్యలు తీసుకుంటాం. ఐపీఎల్‌తో షెడ్యూల్ క్లాష్ అవ్వడం వల్ల మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. కొంతమంది ఆటగాళ్లు అక్కడికి వెళ్లినప్పటికీ, చాలా మంది అగ్రశ్రేణి ఆటగాళ్లు మా కోసం ఆడటానికి ఇక్కడికి వస్తారు.

# హనుమాన్ చాలీసానే వింటాను


## ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య క్రీడా వర్గాల్లో ఎప్పుడూ హాట్?టాపిక్?గా నిలుస్తుంటాడు. రీసెంట్?గా అత్యంత ఖరీదైన ఫెరారీ 12 సిలిండ్రి  కారును కొనుగోలు చేశాడు. దీని ఖరీదు రూ.8 కోట్లకు పైమాటే. ఈ లగ్జరీ కారులో పాండ్య రీసెంట్?గా తన గర్ల్?ఫ్రెండ్?తో కలిసి చక్కర్లు కొట్టిన వీడియోలు వైరల్?గా మారాయి. దీంతో అతడి లగ్జరీ లైఫ్ గురించి మరోసారి నెట్టింట చర్చ మొదలైంది. ఈ క్రమంలో హార్దిక్ తాజాగా చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం హార్దిక్ ఐపీఎల్ ప్రిపరేషన్స్?లో బిజీగా ఉన్నాడు. తాజాగా జట్టు బ్యాటింగ్ కోచ్? కీరన్ పొలార్డ్?తో ముంబయిలో ఓ ఈవెంట్?లో పాల్గొన్నాడు. ఇందులో అతడు మాట్లాడుతూ, హనుమాన్ చాలీసా ఇచ్చినంత పాజిటివ్ ఎనర్జి ఏ పాట కూడా ఇవ్వలేదని పేర్కొన్నాడు. తాను ఫెరారీ కారులో వెళ్తున్నప్పటికీ జర్నీ చేసేటప్పుడు 'హనుమాన్ చాలీసా'నే వింటానని తెలిపాడు. 'నాకు ఫెరారీ కారు ఉంది. అది ఎంత లగ్జరీ అయినప్పటికీ అందులో వెళ్తుంటే నేను హనుమాన్ చాలీసానే వింటాను. ఏ పాట కూడా హనుమాన్ చాలీసా ఇచ్చినంత పాజిటివ్ ఎనర్జి ఇవ్వలేదు. దీనిని అందరూ అంగీకరించాల్సిందే!' అని హార్దిక్ చెప్పాడు.అయితే అత్యంత ఖరీదైన వాచీలు ధరించడం నుంచి లగ్జరీ కార్లలో తిరగడం దాకా హార్దిక్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటాడు. ఇటీవల భారత్ టీ20 వరల్డ్?కప్ నెగ్గిన సందర్భంలో మైదానంలో తన గర్ల్?ఫ్రెండ్ మహీకా శర్మతో



హార్దిక్ చేసుకున్న సంబరాలు కాంట్రవర్సీ అయ్యాయి. మరో 5 రోజుల్లో లీగ్ ప్రారంభం ఉండగా, ముంబయి ఇండియన్స్ కెప్టెన్సీ విషయంలో మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పాండ్య తనకు తానుగా కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని అన్నాడు. అలాగే ఇటీవల భారత్?కు వరల్డ్?కప్ సాధించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్?కు మేనేజ్?మెంట్ జట్టు పగ్గాలు అప్పగించాలని తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషిస్తూ పేర్కొన్నాడు.మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, పాండ్యాతో కలిసి ఈ విషయమై ఫ్రాంచైజీ మేనేజ్?మెంట్? చర్చించాలని అన్నాడు. 'ఈ ఏడాది సూర్య కెప్టెన్?గా ఉండాలి. అయితే ఇక్కడ హార్దిక్ మంచి నాయకుడే. కానీ విచిత్రమేంటంటే ప్రస్తుతం అతడి కెప్టెన్సీలోనే టీ20 వరల్డ్?కప్?లు గెలిచిన ఇద్దరు ఆడుతున్నారు. వాస్తవానికి సూర్య కెప్టెన్సీ ఇవ్వాలి. కానీ మేనేజ్?మెంట్ మాత్రం పాండ్యకే మొగ్గు చూపుతుందేమో' అని కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నాడు. కాగా, ఐదుసార్లు ఛాంపియన్? అయిన ముంబయి ఇండియన్స్?కు ఆరో టైటిల్ అందించడమే తన లక్ష్యమని హార్దిక్ అన్నాడు. జట్టులో ఇప్పటికే ఘనమైన వారసత్వం ఉందని, ఆ లెగసీని ముందుకు తీసుకెళ్లడమే తన పని అని పేర్కొన్నాడు. టీమ్?లో అందరూ శక్తి వంచన లేకుండా ఆడేందుకు సిద్ధంగా ఉన్నారని, అత్యుత్తమ ఆటకు తమ జట్టు ప్రతిబింబంలా నిలవాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు.

# విశ్వేజి



## ప్రతీరోజూ 7గంటల కంటే తక్కువ సమయం నిద్రపోవటం వలన ఏం జరుగుతుంది?

నిద్ర... మానవ జీవితంలో అతి ముఖ్యమైన భాగం. ప్రతిరోజు ఎనిమిది గంటలు నిద్ర లేకపోతే మనిషి ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతిరోజు అవసరమైనంత నిద్రపోయిన వారు ఆరోగ్యంగా ఉంటారు. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చాలామంది అర్థరాత్రి వరకు మెలకువగా ఉండి ఎప్పుడో పడుకుంటారు. వారు కనీసం 7గంటల పాటు కూడా నిద్రపోరు. అయితే దాని ప్రభావం వారి శరీరం పైన పడుతుందనే విషయాన్ని వారు గమనించరు. కానీ ఇది నిజం. 7 గంటల కంటే తక్కువ నిద్రపోతే జరిగేదిదే ప్రతిరోజు ఏడు గంటల కంటే తక్కువ నిద్రపోయిన వారిలో రకరకాల సమస్యలు వస్తాయి. శారీరక, మానసిక సమస్యలతో వారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో కూడా సమయం దొరకడం లేదు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఒక వ్యక్తి 7 గంటల కంటే తక్కువ నిద్రపోతే అతనికి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల తేదీలు దానం, కడియంకు బిగ్ షాక్ ఇచ్చిన రేవంత్ రెడ్డి తక్కువ సమయం నిద్రపోతే ఆరోగ్యానికి హాని ఏడు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోతే అది మీ ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం 7 గంటల సమయం కంటే తక్కువ నిద్రపోయే వ్యక్తి వేగంగా బరువు పెరుగుతారు. నిద్ర చక్రంలో ఆటంకాలు ఏర్పడతాయి. ఇవి మానసిక రుగ్మతలకు కూడా కారణమవుతాయి. ఏడు గంటల కంటే తక్కువ నిద్రపోవడం వల్ల వారిలో ఒత్తిడి, టెన్షన్ పెరుగుతుంది. డిప్రెషన్ వంటి సమస్యలను ఎదుర్కొంటారు. సరిపోను నిద్రపోతే శరీరం రిపేర్ 7 గంటలకంటే తక్కువ నిద్రపోయే వ్యక్తులు ఉదయం తాజా అనుభూతిని చెందరు. శరీరంలో అలసట అలాగే ఉంటుంది. రాత్రి సమయంలో నిద్ర పోయినప్పుడు మన శరీరంలో ఉన్న చిన్న చిన్న సమస్యలు రిపేర్ చేయబడతాయి. సరిగ్గా నిద్రపోని వారిలో శరీరం రిపేర్ కాదు. ఫలితంగా అనారోగ్యం వస్తుంది. శరీరం నుంచి టాక్సిన్స్ బయటకు పోవు. నిద్రలేమితో వచ్చే రోగాలివే శరీరంలో విషపదార్థాలు చేరడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతోపాటు రక్తపోటు కూడా పెరుగుతుంది. ఫలితంగా ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు ఉరుకుల పరుగుల జీవితంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఈరోజు ఏడు నుంచి ఎనిమిది గంటలసేపు కచ్చితంగా నిద్ర పోవాలి.

## వర్షాకాలంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు, వీటితో కూడా బెనిఫిట్స్!




వర్షాకాలంలో సీజనల్ డిసీజెస్ దాడి చేస్తాయి. వర్షాకాలంలో కాలానుగుణంగా వచ్చే రోగాల నుండి కాపాడుకోవడానికి రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడం చాలా అవసరం. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మన ఇమ్యూనిటీని ఏ విధంగా పెంచుకోవాలి? ఈ సీజన్లో ఇమ్యూనిటీని బూస్ట్ చేసే ఆహారాలు ఏమిటి? అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. వర్షాకాలంలో ఇమ్యూనిటీ కోసం ఆహారాలు వర్షాకాలం తరచుగా అనేక ఆరోగ్య సమస్యలను తీసుకువస్తుంది. ఆరోగ్యంగా ఉండటానికి, రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాల పైన దృష్టి సారించడం చాలా అవసరం. విటమిన్లు మరియు ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న సమతుల్య ఆహారం శరీరాన్ని అనేక రోగాల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. ఈ సమయంలో మీ రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడానికి కొన్ని చిట్కాలు ఇక్కడ ఉన్నాయి. వర్షాకాలంలో విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. విటమిన్ %జ% దాని రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. నారింజలు, బత్తాయి మరియు నిమ్మ వంటి సిట్రస్ పండ్లు విటమిన్ సి పుష్కలంగా ఉండే పండ్లు. ఇవి మీ రోజువారీ ఆహారంలో చేర్చడం సాధారణ జలుబు మరియు ఫ్లూ నుండి మీ శరీరాన్ని కాపాడుతుంది. ఆకుకూరలు, కూరగాయలను ఎంచుకోండి.. పాలకూర, బచ్చలి కూర మరియు పచ్చి అరటికాయలు వంటి ఆకు కూరగాయలు ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి విటమిన్లు %ూ, జ%, మరియు %ఖ% ను అందిస్తాయి. ఇవి బలమైన రోగనిరోధక వ్యవస్థను నిర్వహించడానికి కీలకంగా పనిచేస్తాయి. మనం తీసుకునే ఆహారంలో ఈ కూరగాయలను చేర్చడం మన ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది. తగినంత నీరు త్రాగండి.. సరైన హైడ్రేషన్ మంచి ఆరోగ్యాన్ని నిర్వహించడానికి కీలకం. తగినంత నీరు త్రాగడం శరీరం నుండి విషాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. తగినంత నీటితో పాటు, హర్బల్ టీలు మరియు సూప్‌లు వర్షాకాలంలో కూడా ప్రయోజనకరంగా ఉంటాయి, వేడి మరియు హైడ్రేషన్‌ను అందిస్తాయి. అల్లం మరియు వెల్లుల్లిని చేర్చండి.. అల్లం మరియు వెల్లుల్లి సహజ యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. వీటిని సులభంగా ఆహారంలో చేర్చుకుంటే మంచిది. అల్లం వెల్లుల్లి రుచిని మాత్రమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడతాయి. ప్రొబయోటిక్స్‌ను తీసుకోండి... ప్రొబయోటిక్స్ గట్ ఆరోగ్యంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ఇది రోగనిరోధక శక్తి పెంచడానికి దోహదం చేస్తుంది. పెరుగు ప్రొబయోటిక్స్ యొక్క గొప్ప వనరు. దీన్ని మీ ఆహారంలో చేర్చడం జీర్ణశక్తికి మరియు రోగనిరోధక శక్తి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జంక్ ఫుడ్‌ను నివారించండి... ప్రాసెస్ చేసిన ఆహారాలు కాలక్రమేణా రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తాయి. వర్షాకాలంలో జంక్ ఫుడ్ తీసుకోవడం పరిమితం చేయడం మంచిది. బదులుగా, అవసరమైన పోషకాలను అందించే సంపూర్ణ ఆహారంపై దృష్టి పెట్టండి.

## 'సామాన్య శాస్త్రానికి' తను ఒక మారు పేరు!




సైన్స్‌ను సామాన్యుల దగ్గరికి తీసుకుపోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి ఫాల్కి. 'సైంటిఫిక్ స్టోరీ టెల్లర్'గా దేశవిదేశాల్లో పేరు తెచ్చుకున్న జాహ్నవి సైన్స్‌కు సంబంధించిన డాక్యుమెంటరీలు తీసింది. పుస్తకాలు రాసింది. 'అడగడం' 'తెలుసుకోవడం' అనే ప్రక్రియ జాహ్నవికి ఎంతో ఇష్టమైనది. ఆమెకు బాగా నచ్చే మాట.. రైట్ క్వశ్చన్. రిసెర్చ్ వర్క్ నుంచి కెరీర్‌కు సంబంధించి డైరెక్షన్‌ను మార్చుకోవడం వరకు 'రైట్ క్వశ్చన్' అనేది ఆమెకు ఎంతో ఉపయోగపడింది. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరకు తీసుకెళ్లింది. అక్కడ భారతదేశ శాస్త్ర సాంకేతిక చరిత్రను అధ్యయనం చేసింది. ఆ చరిత్రపై బాగా ఇష్టాన్ని పెంచుకుంది. తాను తెలుసుకున్న విషయాలను, తన అభిప్రాయాలను నలుగురితో పంచుకోవడానికి వివిధ మాధ్యమాలను ఎంచుకుంది. 'బాంబే యూనివర్శిటీ'లో సివిక్స్ అండ్ పాలిటిక్స్ చదువుకున్న జాహ్నవి 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో సైన్స్ అండ్ టెక్నాలజీ హిస్టరీలో డాక్టరేట్ చేసింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం ద్వారా సామాజిక కోణంలో సైన్స్‌ను అర్థం చేసుకుంది. ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'సైన్స్ అనేది ఒంటరి కాదు' సైన్స్‌ను ప్రభావితం చేసే అంశాలు సమాజంలో ఎన్నో ఉంటాయి. ఆ అంశాలకు సైన్స్‌కు మధ్య ఉండే అంతః సంబంధాన్ని లోతుగా అధ్యయనం చేసింది. 'ఆటోమిక్ స్టేట్ బిగ్ సైన్స్ ఇన్ ట్వంటీయత్ సెంచరీ ఇండియా సైన్స్' పుస్తకం జాహ్నవికి ఎంతో పేరు తెచ్చింది. 'కీ కాన్సెప్ట్స్ ఇన్ మోడ్రన్ ఇండియన్ స్టడీస్'కు కో%--%ఎడిటర్‌గా వ్యవహరించింది. 'సైక్లోట్రాన్' పేరుతో సైన్స్ డాక్యుమెంటరీ తీసింది. సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ద్వారా కథలు చెప్పడం తనకు ఇష్టమైన పని. 'మెనూ గురించి తెలుసుకోవాలంటే మనం మొదట ఉండాల్సింది టేబుల్ దగ్గర' అంటున్న జాహ్నవి 'సైన్స్' అనే మెనూ గురించి తెలుసుకోవడానికి 'సైన్స్ గ్యాలరీ' అనే టేబుల్ దగ్గరికి ప్రజలను తీసుకువస్తుంది. లండన్‌లోని కింగ్స్ కాలేజీ ఫ్యాకల్టీగా పనిచేసిన జాహ్నవి 2018లో 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ఫౌండింగ్ మెంబర్‌గా నియమితురాలైంది. ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచానికి కాస్త దూరంగా.. సృజనాత్మకంగా ఆలోచించేలా, ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. 'మ్యూజియం' వాతావరణం ఆమెకు కొత్త కాదు. 'సైన్స్ మ్యూజియం లండన్' ఎక్స్‌టర్నల్ క్యురేటర్‌గా పనిచేసి ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. 'మా టార్గెట్ ఆడియెన్స్ పదిహేనేళ్ల పైబడిన వారు అయినప్పటికీ అండర్ గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లపై కూడా దృష్టి సారిస్తాం. అంతరిక్షానికి సంబంధించి సమకాలీన, భవిష్యత్ విషయాలపై దృష్టి పెట్టేలా గ్యాలరీ తోడ్పడుతుంది' అంటుంది జాహ్నవి. శాస్త్రీయ విషయాలతో యువత మమేకం కావడానికి డిజిటల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. 'బ్రేకింగ్ ది వాల్స్ బిట్వీన్ సైన్స్ అండ్ కల్చర్' శీర్షికతో నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ గ్యాలరీకి కూడా మంచి స్పందన వచ్చింది. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ జాహ్నవిని హ్యూమానిటీస్ విభాగంలో 'ఇన్ఫోసిస్ ప్రైజ్'తో సత్కరించింది. సైన్స్‌ను జాహ్నవి అర్థం చేసుకున్న కోణాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ప్రశంసించింది.

## రోగనిరోధక శక్తి మరియు జీర్ణక్రియ కోసం లవంగం నీటి ఆరోగ్య ప్రయోజనాలను అన్వేషించండి



ప్రతీ ఇంటా లవంగాలు తప్పని సరిగా ఉంటాయి. వంట ఇంటి మసాలా దినుసుల్లో వినియోగించే ఈ లవంగాలు ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. ఆయుర్వేద ప్రకారం లవంగాలు అద్భుతమైన ఔషధం. లవంగాలు నేరుగా తీసుకోవటం లేదా ఘాటు ఎక్కువగా ఉంటే నీటిలో వేసుకొని తాగటం వలన మంచి ప్రయోజనాలు ఉంటాయి. పలు రోగాలను నయం చేసే గుణం లవంగాలకు ఉంది. ఆరోగ్య పరంగా లవంగాల ద్వారా వచ్చే ప్రయోనాల గురించి ఆయుర్వే వైద్యులు కీలక అంశాలను వెల్లడించారు. నిత్యం లవంగాల నీళ్లను తాగడం వల్ల జీర్ణవ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో ఆహారాన్ని జీర్ణాశయం సులభంగా జీర్ణం చేస్తుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి, వికారం వంటి సమస్యలు తగ్గుతాయి. లవంగాల్లో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం జీర్ణాశయ గోడలను సంర క్షిస్తుంది. దీంతో అల్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. లవంగాలలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల లవంగాల నీళ్లను తాగితే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. లవంగాల్లో యాంటీ సెప్టిక్ గుణాలు సైతం ఉంటాయి. లవంగాలను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. %ూశ్రీంశీ =ఖుఎ% రోజూ చపాతీ తింటే వచ్చే ఆరోగ్య సమస్యలు ఇవే.. జాగ్రత్త మరి..!! లవంగాల నీళ్లను తాగితే శరీరంలోని వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యం గా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అలాగే తలనొప్పి నుంచి బయట పడవచ్చు. అధ్యయనాల ప్రకారం లవంగాల నీళ్లను తాగుతుంటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. లవంగాల్లో నైజెరిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు లవంగాల నీళ్లను తాగుతుంటే ఫలితం ఉంటుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. సీజనల్ గా వచ్చే రోగాల నుంచి బయట పడవచ్చని సూ చిస్తున్నారు. ఇలా.. లవంగాల నీళ్ల ను తీసుకోవటం ద్వారా అనేక ప్రయోజనాలు సొంతం చేసుకోవచ్చు.

## వేగంగా బరువు తగ్గాలంటే ఉదయాన్నే ఈ అలవాట్లను పాటించండి!!



ప్రస్తుతం సమాజంలో చాలామంది ఎదుర్కొంటున్న అతి ప్రధానమైన సమస్య ఊబకాయం. విపరీతంగా బరువు పెరిగి, బరువు తగ్గక ఇబ్బందులు పడుతున్న వారు ఎంతోమంది ఉన్నారు. బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలితం శూన్యంగా మారడంతో చాలామంది నిరుత్సాహానికి గురవుతున్నారు. అయితే బరువు తగ్గాలి అనుకునే వారు రోజువారీ సరైన దినచర్యను పాటించాలని ఫిట్నెస్ నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునే వారు కొన్ని అలవాట్లను తప్పనిసరిగా అలవర్చుకోవాలని, ఉదయాన్నే లేవగానే ఈ అలవాట్లను పాటించటం వల్ల వేగంగా బరువు తగ్గడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. ప్రతిరోజు ఉదయం నిద్ర లేచిన వెంటనే పళ్ళు తోముకోకుండానే ఒక గ్లాసు నీళ్ల తాగడం అలవాటు చేసుకోవాలి. పరగడుపున ఒక గ్లాసు నీళ్ల తాగడం వల్ల ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాదు ప్రతిరోజు ఉదయం లేచిన తర్వాత యోగా చేయడం అలవాటు చేసుకోవాలి. యోగా కారణంగా మానసిక ఆరోగ్యం మెరుగు పడడమే కాకుండా, బరువు కూడా బాగా తగ్గుతుంది. ఉదయం నిద్ర లేచిన వెంటనే మార్నింగ్ వాకింగ్ చేయడం అలవాటు చేసుకున్న వారు బరువు బాగా తగ్గడానికి అవకాశం ఉంటుంది. ప్రతిరోజు ఉదయం నడవడం వల్ల శరీరంలో కేలరీలు ఖర్చువుతాయి. దీంతోపాటు సంతోషకర హార్మోన్ల ఉత్పత్తి జరుగుతుంది. ఇది మీ బరువు తగ్గడంతో పాటు, ఆరోగ్యంగా ఉంచేలా చేస్తుంది. ప్రతిరోజు ఉదయం లేచిన తర్వాత వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి. దీంతో ఊబకాయం సమస్య నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంది. అంతేకాదు ఉదయం పూట ఆరోగ్యకరమైన ఆహారాన్ని అల్పాహారంగా తీసుకోవాలి. నూనెలో ముంచి తీసిన పదార్థాలకు స్వస్తి పలకండి. బరువును నియంత్రణలో ఉంచే, పోషకాలు సమృద్ధిగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. మంచి ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం మిమ్మల్ని బరువు తగ్గేలా చేస్తాయి. ఇక ఈ అలవాట్లను మన జీవితంలో ఒక భాగంగా చేసుకుంటే వేగంగా బరువు తగ్గవచ్చు. ఆరోగ్యంగా జీవించవచ్చు.

# ఆంధ్రప్రదేశ్

## ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

### ఇహెచ్ఎస్ బిల్లులపై నేరుగా సమీక్ష

అమరావతి,మార్చి23 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ నిర్వహణలో సమూల మార్పులు శ్రీకారం చుట్టారు. గత కొంతకాలంగా ఈహెచ్ఎస్ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం ఇకపై అన్ని రకాల లావాదేవీలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ద్వారా ఆసుపత్రులు అందించే చికిత్స బిల్లులు నేరుగా ఆన్‌లైన్ ద్వారానే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయానికి చేరుతాయి, తద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చెల్లింపుల ప్రక్రియ వేగవంతం అవుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఈహెచ్ఎస్ విధానాన్ని ప్రభుత్వం సమగ్రంగా పునఃసమీక్షించి, ఉద్యోగులు , పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మరింత సరళీకృతమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పాత పద్ధతిలో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్ది, ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా ఆసుపత్రులకు సకాలంలో నిధులు విడుదలయ్యేలా చూడాలని, తద్వారా ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స (అజీబర్గ ÷బబ ÷స।జీబిప।నిబి) నిరంతరాయంగా అందాలని ఆయన స్పష్టం చేశారు.

## ఇంటిపై దాడి,ధ్వంపై అంబటి ఫిర్యాదు

### ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం దారుణం

### న్యాయం చేయకపోతే సుప్రీం కోర్టు గడప తొక్కుతా

గుంటూరు,మార్చి23 : తన ఇల్లు, ఆఫీసుపై జరిగిన దాడిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి కేసులో విచారణ అధికారిని మార్చాలని, నల్లపాడు పోలీస్ స్టేషన్ లో కస్టోడియల్ టార్చర్ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని రెండు ఫిర్యాదులు చేశారు. టీడీపీ నాయకుల దాడికి పోలీసులు పూర్తిగా సహకరించారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని తాను ఫిర్యాదు చేసే వరకూ కేసు నమోదు చెయ్యలేదన్నారు. ఏడేళ్ల లోపు శిక్షపడే సెక్షన్లతో కేసు నమోదు చేసినా జైలులు పంపి తన ఇంటిపై దాడి చేసినవారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారన్నారు. పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు నా కేసు వ్యవహారంలో దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇక్కడ న్యాయం జరగకపోతే హైకోర్టు, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని తేల్చిచెప్పారు. జనవరి 31న తన ఇల్లు, కార్యాలయంపై సుమారు 7 గంటల పాటు దాడి జరిగిందని ఆరోపణ చేశారు. దాడి తర్వాత తనను అరెస్ట్ చేసి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదల చేసినట్లు వెల్లడించారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయలేదని విమర్శలు చేశారు. పిర్యాదు చేసిన తర్వాతే కేసు నమోదు చేశారని ఆరోపణలు చేశారు. తన ఇంటిపై దాడి, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలన్నారు. సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు జరపాలని, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్ స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ ఘటన వెనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఉన్నారని ఆయన ఆరోపించిన అంబటి రాంబాబు.. అలాగే టీడీపీ నేతలతో పోలీసులు కుమ్మక్కయ్యారని కూడా విమర్శించారు. తనపై నమోదైన కేసులు, అరెస్ట్ విధానంపై ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్లు తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

## తమిళనాట బిజెపి సీట్ల షేరింగ్

### 27 స్థానాల్లో బీజేపీ పోటీ

చెన్నై,మార్చి23 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలను నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ సోమవారంనాడు పూర్తి చేసింది. ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి, బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జి, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో సీట్ల పంపకాలు ఖరారయ్యాయి. చెన్నైలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీజేపీ తమిళనాడు విభాగం చీఫ్ నయనార్ నాగేంద్రన్, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకర్ కూడా పాల్గొన్నారు. సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు 27 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనుంది. 2021లో బీజేపీకి కేటాయించిన సీట్ల కంటే 7 సీట్లు ఎక్కువగా ఈసారి కేటాయించారు. పీఎంకేకు 18, ఏఎంఎంకేకు 11 సీట్లు కేటాయించారు. అన్నాడీఎంకేకు సింహభాగం సీట్లు లభించాయి. 170కి పైగా సీట్లలో అన్నాడీఎంకే పోటీ చేయనుంది.సీట్ల పంపకాలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, తామంతా ఒక కుటుంబమని, కలిసికట్టుగా విజయం కోసం పోరాతామని చెప్పారు. 27 సీట్లతో తాము సంతృప్తిగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర సంస్కృతిని స్టాలిన్, ఉదయనిధి అవమానించారని, ప్రజలు కూడా విసుగెత్తిపోయారని, ఈ ఎన్నికలను తాము స్వీప్ చేస్తామని చెప్పారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## సునీల్ నాయక్ విచారణ పూర్తి

గుంటూరు,మార్చి23 : ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణ ముగిసింది. విచారణ అధికారి ఎస్పీ దామోదర్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఆయన్ను విచారించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు గుంటూరు సీసీఎస్ స్టేషన్‌లో సునీల్ నాయక్ విచారణకు హాజరయ్యారు. అయితే మార్చి 12న విచారణకు హాజరు కాలేదు. తన తల్లి అనారోగ్యం కారణంగా పట్నా వెళ్లేందుకు హైకోర్టు అనుమతి కోరడంతో.. న్యాయస్థానం అందుకు సమ్మతించింది. ఇవాళ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసులో సునీల్‌ను పలు దఫాలుగా విచారించిన అధికారులు వివిధ అంశాలపై ప్రశ్నలు సంధించారు. అయితే, అతడి నుంచి సరైన సమాధానాలు రాలేదని సమాచారం.

## డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

### నిందితులకు మూడురోజు పోలీస్ కస్టడీ

హైదరాబాద్,మార్చి23 : మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన నిందితులను పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశించింది. విచారణలో భాగంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసుల అభ్యర్థనపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు అనుమతితో నిందితులను రేపటి నుంచి కస్టడీకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో డ్రగ్స్ సరఫరా, నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలను వెలికితీయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, కస్టడీ విచారణలో మరిన్ని కీలక వివరాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

## హాస్టల్ పరిస్తితులపై మంత్రి సవిత తనిఖీ

### నేరుగా పరిశీలిచి..విద్యార్థులతో ఆరా



రాజమండ్రి,మార్చి23 :విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, హాస్టళ్లలో వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. సోమవారం రాజమండ్రిలోని గణెళిశ్ చౌక్‌లో ఉన్న బీసీ ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్‌ను ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత హాస్టల్‌లోని ప్రతి గదిని పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అక్కడ అందుతున్న వసతులు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఫార్మసీ, పారామెడికల్ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థినులు, తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో జాప్యం జరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్ మెస్‌ను తనిఖీ చేసిన మంత్రి, విద్యార్థునుల కోసం వండిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. అనంతరం విద్యార్థినులలో కలిసి కూర్చుని కాసేపు ముచ్చటించారు. భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ..'బీసీ హాస్టళ్లలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాం. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం. విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోంటోంది' అని అన్నారు.

## మిట్టల్ స్టీల్‌తో పారిశ్రామిక హబ్‌గా విశాఖ

### రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి,మార్చి23 : ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో విశాఖ ప్రాంతం పరిశ్రమల హబ్‌గా మారుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, యువ నేత, మంత్రి నారా లోకేశ్ కష్టానికి ప్రతిఫలం ఈ ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటు అని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి చరిత్రలో నేడు ఓ గొప్ప మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఉక్కు రంగంలో రాష్ట్రానికి రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిందని మంత్రి అనగాని వివరించారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో సోమవారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో కలిసి సీఎం చంద్రబాబు ఈ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది. ఈ స్టీల్ ఎ÷-లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో మరో 6 వేల ఉద్యోగాలు క్యాప్టివ్ పోర్ట్ ద్వారా రానున్నాయి. ఇక ఈ స్టీల్ ఎ÷-లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది.

## తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ

### కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ,మార్చి23 : తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ పొడిగింపునకు సంబంధించి అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని మెడికల్ కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు సిద్దంగా ఉన్నారని, సీట్లు వృథా కాకుండా చూడాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపు అంశంపై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాల యాజమాన్యాలు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని, అయితే ఆ తేదీకి ఆంధ్రప్రదేశ్‌లో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి కాలేజీ యాజమాన్యాలు తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరఫు న్యాయవాదులు తీసుకువచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేశాయి. యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా ఎన్ఎంసీ నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదని కోర్టుకు న్యాయవాదులు చెప్పారు.

## భార్యపై అనుమానం సెగలు

### ఆవేశంతో హత్యచేసిన దుండగుడు

రంగారెడ్డి,మార్చి23 : అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన మాట వినడం లేదని, ఇతరులతో చనువుగా ఉంటోందని భార్యను అత్యంత కిరాతకంగా చంపాడో భర్త. ఈ ఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని బైక్‌పై తరలించి పొలాల్లో పడేసిన నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్టు చేశారు. హత్య కు సంబంధించిన పూర్తి వివరాలు సోమవారం షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఏసిపి లక్ష్మీనారాయణ మీడియాకు వివరించారు. పోలీసులు తెలిపిన ప్రకారం ఘటన వివరాల్లోకి వెళ్తే.. ?మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేటకు చెందిన పానుగంటి నర్సింలు (31), అదే ప్రాంతానికి చెందిన శోభ అలియాస్ శోభారాణి (33)ని నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె మమత ఉంది. శోభకు అంతకుముందే వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం సజావుగా సాగిన వీరి సంసారంలో నర్సింలు మద్యానికి బానిస కావడంతో గొడవలు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక శోభ తన కుమార్తెతో కలిసి రంగారెడ్డిగూడెంలోని తన తల్లి వద్ద నివసిస్తోంది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింలు, ఎలాగైనా ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు.?మాయమాటలతో పిలిపించి.. ?ఈ నెల 21న నీ కొడుక్కి సైకిల్ ఇప్పిస్తాను, మహబూబ్‌నగర్‌కు రా అని నర్సింలు శోభను నమ్మించి పిలిపించాడు. ఆమె తన కుమార్తెతో కలిసి రాగా, తన గదికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. అక్కడ మళ్లీ గొడవ జరగడంతో, ముందే సిద్ధం చేసుకున్న గ్రానైట్ రాయితో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. ??హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా రక్తపు మరకలను శుభ్రం చేశాడు. అర్ధరాత్రి సమయంలో శోభ మృతదేహాన్ని మూటకట్టి, బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టుకున్నాడు. దానిపైనే తన మూడేళ్ల కుమార్తెను కూర్చోబెట్టుకుని, రంగారెడ్డిగూడెం శివారులోని ఓ పొలం గట్టున పడేసి పరారయ్యాడు. మరుసటి రోజు ఉదయం స్థానికుల సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి సాంకేతిక ఆధారాలతో నిందితుడి కదలికలను గమనించి, సోమవారం ఉదయం లింగంపల్లిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఒక సెల్ ఫోన్, హత్యకు వాడిన రాయి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మీడియా కు వివరించారు.నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం, ఎస్ఐలు సుశీల, శ్రీకాంత్, రాజేశ్వర్, శివరెడ్డిలను ఫ్యూచర్ సిటీ కమిషనర్, షాద్‌నగర్ డీసీపీ అభినందించారు.

## టెహ్రాన్‌లో చర్చలుజరుపుతున్నాం

### యుఖ్యమైన నేతలతోనే ఇవి కొనసాగుతున్నాయి

### టరంప్ ప్రకటన..తోసిపుచ్చిన ఇరాన్

వాషింగ్టన్,మార్చి23 : పశ్చిమాసియాలో యుద్ధాన్ని నిలిపివేసే విషయమై రెండ్రోజులుగా ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారంనాడు ప్రకటించడం, అలాంటిదేమీ లేదంటూ ఇరాన్ తోసిపుచ్చడంపై తాజాగా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఇరాన్ స్పందన అనంతరం తాజాగా మరోసారి ట్రంప్ స్పందించారు. ఇరాన్‌లో ఒక నాయకుడు కాదు, చాలా మంది నేతలతో యూఎస్ మాట్లాడుతోందని ఆయన తెలిపారు. చర్చలకు చొరవ తీసుకున్నది కూడా తాను కాదని, రెండో వైపు నుంచే ప్రతిపాదన వచ్చిందని అన్నారు. 'నేను వారిని పిలవలేదు. వారే మాట్లాడారు. ఒక డీల్ కుదుర్చుకోవాలని కోరుకుంటునట్టు చెప్పారు. అందుకు మేము కూడా సిద్ధంగానే ఉన్నామని చెప్పాం' అని మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. ఒక అగ్రనేతతో చర్చలు జరుగుతున్నాయని, అయితే ఆయన ఆదేశ సుప్రీం లీడర్‌తో మాత్రం కాదని అన్నారు. ఆయన గురించి ఎవరికీ తెలియదని, ఆయన బతికున్నారో లేదో కూడా తమకు తెలియదని చెప్పారు. ఆయన చనిపోవాలని కూడా తాను కోరుకోవడం లేదని, అయితే ప్రస్తుతం ఆ జాబ్ ఎవరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ఇరాన్‌లోని ఫేజ్-1 నాయకత్వం, ఫేజ్-2, ఫేజ్-3లో కూడా చాలామందిని తాము మట్టుబెట్టామని, అయితే అందరూ గౌరవించే ఒక నాయకుడితో తాము చర్చలు జరినట్టు చెప్పారు. ఆయన ఎవరనేది మాత్రం వెల్లడించలేదు. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తీవ్రమవుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, మౌలిక వసతులపై 5 రోజుల పాటు దాడులు నిలిపివేయాలని తాను ఆదేశాలు జారీచేసినట్టు తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## ఉద్యోగం కోసం మందలింపు

### ఆవేవంతో మామ చంపేసిన అల్లుడు

మార్కాపురం,మార్చి23 : ఉద్యోగం చూసుకోమని మందలించడంతో కోపం కట్టలు తెంచుకున్న ఓ అల్లుడు యూట్యూబ్‌లో క్రైమ్ వీడియోలు చూసి? మామ హత్యకు స్కెచ్ వేశాడు. పెళ్ళై రెండు నెలలే అయినా.. కుటుంబంలో కలహాల కారణంతో చివరకు నరరూప రాక్షసుడిగా మారిపోయాడు. మార్కాపురం జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ దారుణ ఘటన వెనుక అసలు స్టోరీ ఏంటి. అల్లుడే మామపై దాడి ఎందుకు చేశాడు.. ?మార్కాపురం జిల్లా బేస్తవారిపేట గాంధీ బజార్ ప్రాంతం.. మధ్యాహ్నం సమయం.. ప్రశాంతంగా సాగుతున్న వారి జీవితంలో ఒక్కసారిగా కలకలం రేగింది. దూదేకుల ఖాజావలి అనే వ్యక్తి తనకు వరుసకు అల్లుడు అయ్యే పీరావలి అనే వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. అదే సమయంలో పిల్లనిచ్చిన మామ దూదేకుల రాజా హుస్సేన్‌పై కూడా పీరావలి తీవ్ర దాడికి పాల్పడ్డాడు. ప్రస్తుతం తీవ్ర గాయాలతో హుస్సేన్ రాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనతో స్థానికంగా ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. హత్య జరిగిన వెంటనే నిందితుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ హత్య వెనుక కుటుంబ కలహాలే కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది.

## నిజామాబాద్ పట్టణంలో ఐపిఎల్ హంగామా


### భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లపై మ్యాచ్‌ల వీక్షణం

,మార్చి23 : కేవలం మ్యాచ్ చూడటమే కాకుండా, ఒక మినీ స్టేడియం వాతావరణాన్ని ఇక్కడ కల్పిస్తారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లపై మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వేల మంది అభిమానుల మధ్య కేకలు వేస్తూ మ్యాచ్ చూడటం స్టేడియం అనుభూతిని ఇస్తుంది. మ్యూజిక్, డీజే హంగామాతో పాటు ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంటాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వర్చువల్ బ్యాటింగ్, బౌలింగ్ నెట్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఫేస్ పెయింటింగ్, ఫొటో బూత్స్ వంటి సౌకర్యాలతో అభిమానులు తమకు ఇష్టమైన జట్టుకు మద్దతు తెలపవచ్చు. ఐపీఎల్ 2026 మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య పోరుతో ప్రారంభం కానుంది. తొలి విడతలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసిన బీసీసీఐ, మూడు వారాల పాటు వివిధ నగరాల్లో ఫ్యాన్ పార్కులను నిర్వహించనుంది. మొదటి వారంలో అంటే.. మార్చి 28, 29న రోహ్‌తక్, భోపాల్ వంటి నగరాల్లో ఉంటుంది. రెండో వారంలో ఏప్రిల్ 4, 5 తేదీల్లో నిజామాబాద్‌తో పాటు మథుర, జోధ్‌పుర్, మైసూరు, భువనేశ్వర్‌లలో ఈ సందడి నెలకొంటుంది. మూడో వారంలో.. ఏప్రిల్ 11, 12 తేదీల్లో మేరఠ్, కోయంబత్తూర్ వంటి నగరాల్లో ఏర్పాటు చేస్తారు.

## ఐకానిక్ టవర్‌గా అసెంబ్లీ నిర్మాణం


### మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి,మార్చి23 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ అసెంబ్లీ భవనాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాల కంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ రేట్ల ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.




# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు

టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న 'బైకర్' మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.




# దురంధర్2 కలెక్షన్ల దూకుడు

## ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లు

### తన నటజీవితాన్ని గుర్తు చేసుకున్న గౌరవ


ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది.నాలుగు రోజుల్లోనే 'ధురంధర్ 2' ప్రపంచ వ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ 'పఠాన్' నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే 'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. ఢిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు. 'ఇది 1998లో మా అమ్మానాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది. అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు. నాకు అండగా నిలిచిన మా అమ్మానాన్నలకు ధన్యవాదాలు' అంటూ లేఖను పంచుకున్నారు. అందులో తన తల్లిదండ్రులకు అప్పటి పరిస్థితిని వివరించారు గౌరవ్. 'ప్రస్తుతానికి డబ్బు పరంగా ఏమీ కలిసిరావడం లేదు. కానీ, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను. ఢిల్లీతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చు తగ్గించుకోవడానికి నేను స్నేహితుడితో కలిసి ఓ చిన్న గదిలో ఉంటున్నాను. టెలిఫోన్, విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులతో పాటు భోజనం ఖర్చులు కూడా ఇద్దరం కలిసే పంచుకుంటున్నాం. భవిష్యత్తుపై ఆశతో జీవిస్తున్నాను. కానీ నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది' అని రాసి ఉన్న లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై బాలీవుడ్ ప్రముఖులు స్పందిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదో ఒకరోజు గుర్తింపు లభిస్తుందంటూ ప్రశంసిస్తున్నారు.

# నా పేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు

**ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి**

**గాయని మంగ్లీ ప్రకటన విడుదల**

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వార్ి÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు,÷నాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్-ఇండియా చిత్రం ఐఆ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. 'సర్కే చునర్ తేరి సర్కే' పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.



# రీ ఎంట్రీ ఇస్తున్న నటి రోజా


**12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్**

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రారడ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే డయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# రౌడీ జనార్ధన్ మూవీ కోసం విజయ్ కసరత్తు

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com